RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 102 పేజీలు - 08 మంగళవారం 10 మార్చి 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

## అమెరికా, ఇజ్రాయెల్‌తో మోదీ రాజీపడ్డారు

- కుట్ర బయటపడుతుందనే వెనుకడుగు
- దేశ ప్రజలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది
- సంక్షోభంతో చమురు ధరల పెరుగే అవకాశం
- కేంద్రంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు డిమాండ్



తొలి అక్షరం/న్యూఢిల్లీ,మార్చి 9 : భారత ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మండిపడ్డారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చించడానికి కేంద్ర ప్రభుత్వం ఇష్టపడటం లేదని ఆరోపించారు. పశ్చిమాసియా సంక్షోభం గురించి పార్లమెంట్‌లో చర్చ జరిగితే ప్రధాని మోదీ అమెరికా, ఇజ్రాయెల్‌కు ఎలా మిగతా2లో...

## ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

- సాయం కోసం ప్రజలు పోలీసుల వైపే చూస్తారు
- ప్రజలకు మీరున్నారనే ధైర్యం ఇందుకు కారణం
- నేరాల తీరు మారి..సైబర్ క్రైమ్ పెరిగింది
- నేరాల తీరుకు అనుగుణంగా పనితీరు మార్చుకోవాలి
- పోలీస్ ఆఫీసర్స్ రీట్రీట్‌లో సిఎం రేవంత్ రెడ్డి



తొలి అక్షరం/హైదరాబాద్,మార్చి 9 :ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి పోలీస్ అధికారులు చేస్తున్న కృషిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందించారు. మనం ఎక్కడున్నామోతెలిసుకోగలిగితే మనం ఎక్కడికి చేరుకోవాలో తెలుస్తుందన్నారు. తెలంగాణ పోలీస్ అకాడమిలో తెలంగాణ పోలీస్ ఆఫీసర్స్ రిట్రీట్-2026 కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీజీపీ శివధర్ రెడ్డి, పోలీస్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ రిట్రీట్ కార్యక్రమం ద్వారా సమస్యలు, పరిష్కారాలపై మిగతా2లో...



## తెలంగాణ నుంచి ఇద్దరు రాజ్యసభకు ఏకగ్రీవం

- ధృవీకరణ పత్రాలు అందచేత

తొలి అక్షరం/హైదరాబాద్,మార్చి 9: తెలంగాణ నుంచి నామినేషన్ దాఖలు చేసిన ఇద్దరు అభ్యర్థులు రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డి సోమవారం మిగతా2లో...

## ఇరాన్ కొత్త సుప్రీంగా మొజ్తబా

- ఖమేనీ రెండో కుమారుడు మొజ్తబా
- దేశవ్యాప్తంగా ప్రజలు సంబరాలు



తొలి అక్షరం/లెబనాన్, మార్చి 9 : ఇరాన్ తమ దేశ నూతన సుప్రీం లీడర్‌ను ఎన్నుకుంది. కొత్త సుప్రీం లీడర్‌గా అయతొల్లా ఖమేనీ తనయుడు మొజ్తాబా ఖమేనీని ఎన్నుకున్నట్లు ఇరాన్ అధికారికంగా ప్రకటించింది. 56 ఏళ్ల అయతొల్లా సయ్యద్ మొజ్తాబా హొస్సేని ఖమేనీ అలియాస్ మొజ్తాబా ఖమేనీ ఇరాన్‌కు మూడో సుప్రీం లీడర్‌గా ఎన్నికయ్యాడు. మొజ్తాబాను ఇరాన్ మిగతా2లో...

## అత్యున్నతంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

- ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు
- ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ
- క్రీడాశాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



2లో

## కవితకు మళ్లీ నోటీసులు!

- లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం..
- కవిత సహా 23 మందికి నోటీసులు






2లో

## రైతుబంధు పథకం బంద్... రాహుల్ బంద్ స్టార్

- సిఎం రేవంత్‌పై కెటిఆర్ వ్యంగ్యాస్త్రాలు




తొలి అక్షరం/రాజన్నసిరిసిల్ల,మార్చి 9 : రాష్ట్రంలో రైతు బంధు పథకాన్ని బంద్ చేసి.. కొత్తగా రాహుల్ బంధు పథకాన్ని ముఖ్యమంత్రి రేవంత్ తీసుకు వచ్చారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ వ్యంగ్యంగా అన్నారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి ఏడాదికి రూ. వెయ్యి కోట్లు పంపడమే రాహుల్ బంధు పథకమని ఆయన అభివర్ణించారు. సంవత్సరానికి రూ.1000 కోట్లు కప్పం కట్టి తన పదవిని సీఎం రేవంత్ రెడ్డి కాపాడుకొంటున్నారని ఆరోపించారు. సోమవారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్ పర్యటించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను ఆయన ఘనంగా మిగతా2లో...

## వెలుగుమట్ల బాధితులతో కవిత ధర్నా

- ఖమ్మం జడ్పీ కూడలిలో ఆందోళన
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం
- కవితను అరెస్ట్ చేసిన పోలీసులు



తొలి అక్షరం/ఖమ్మం,మార్చి 9: ఖమ్మం జిల్లా వెలుగుమట్ల బాధితులకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. సోమవారం ఖమ్మం నగరంలోని అంబేడ్కర్ భవనంలో వెలుగుమట్ల బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటివరకూ బాధితులకు ప్రభుత్వం అండగా లేదని విమర్శించారు. ప్రభుత్వం తరపున వారికి వైద్య సహాయం కూడా అందలేదన్నారు. అనంతరం ఖమ్మం జడ్పీ కూడలిలో కవిత ఆందోళనకు దిగారు. వెలుగుమట్ల బాధితులకు న్యాయం చేయాలంటూ ధర్నా నిర్వహించారు. బాధితులతో కలిసి జడ్పీ కూడలిలో రోడ్డుపై బైఠాయించారు. దీంతో ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకొని సర్ది చెప్పడంతో ఆమె నిరసనను విరమించుకున్నారు. ఈ క్రమంలో ఖమ్మం జిల్లాలోని జడ్పీ సెంటర్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. వెలుగుమట్ల భూదాన్ యజ్ఞ బోర్డు భూముల నిర్వాసితులతో కలిసి ఆందోళనకు తెలంగాణ మిగతా2లో...

## తిరుమల లడ్డూకు నెయ్యి కొరత లేదు

- అందుబాటులో తయారీకి కావాల్సినంత నెయ్యి
- తప్పడు ప్రచారాలను ఖండించిన టిటిడి



తొలి అక్షరం/తిరుమల,మార్చి 9 : శ్రీవారి లడ్డూ ప్రసాదాల తయారీకి అవసరమైన నెయ్యి నిల్వలు సరిపడా ఉన్నాయని తిరుమల తిరుపతి దేవస్థానం టిటిడి బోర్డు స్పష్టం చేసింది. తితిదే వద్ద నెయ్యి నిల్వలు సరిపడా లేవని, లడ్డూ ప్రసాదాల తయారీలో అంతరాయం ఏర్పడుతోందని ఇటీవల కొందరు సామాజిక మాధ్యమాల్లో అసత్య ప్రచారం చేయడంపై తితిదే స్పందించింది. ఇలా అసత్య ప్రచారం చేయడం సరికాదని తితిదే పేర్కొంది. లడ్డూల తయారీకి మిగతా2లో...

## గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఘనంగా వీడ్కోలు



2లో

# అమెరికా, ఇజ్రాయెల్‌తో మోదీ రాజీపడ్డారు

(మొదటి పేజీ తరువాయి)

రాజీ పడ్డారో బయటపడుతుందని అన్నారు. పశ్చిమాసియాలో పరిస్థితులు దేశ ప్రజలపై కూడా ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని తెలిపారు. అలాగే అక్కడి సంక్షోభం చమురు ధరల పెరుగుదలకు దారితీయవచ్చని అభిప్రాయపడ్డారు. "పశ్చిమాసియా సంక్షోభం భారత ఆర్థిక వ్యవస్థకు పెద్ద నష్టాన్ని కలిగిస్తుంది. స్టాక్ మార్కెట్లలో ఏం జరుగుతుందో మీరు చూశారు. ప్రధాని మోదీ అమెరికా ట్రేడ్ డీల్‌పై సంతకం చేశారు. దీంతో దేశం దెబ్బ తినబోతోంది. అలాగే పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చించడంలో వారికి ఏ సమస్య ఉంది? ఆ తర్వాత మనం ఇతర అంశాలపై చర్చ జరపవచ్చు. పశ్చిమాసియా మన దేశానికి ముఖ్యం కాదా? ఇంధన ధరలు, ఆర్థిక విధ్వంసం మనకు ముఖ్యమైన చర్చనీయాంశాలు కావా? అవే మనకు ప్రజా సమస్యలు" అని రాహుల్ గాంధీ అన్నారు. పశ్చిమాసియా సంక్షోభాన్ని తాము ముఖ్యమైనదిగా భావిస్తున్నామని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. అందుకే ఆ అంశంపై చర్చను కోరుతున్నామని అన్నారు. "కానీ కేంద్ర సర్కార్ పశ్చిమాసియా సంక్షోభం గురించి చర్చ జరిపేందుకు ఇష్టపడడం లేదు. ఎందుకంటే ఆ అంశంపై చర్చ జరిపితే ఇతర విషయాలు బయటకు వస్తాయి. ప్రధాని మోదీ వైఖరి బయటపడుతుంది. మోదీ ఎలా రాజీ పడ్డారు? ఆయనను ఎలా బ్లాక్ మెయిల్ చేస్తున్నారు? వంటి విషయాలు తెలుస్తాయి. అందుకే పార్లమెంట్‌లో పశ్చిమాసియా సంక్షోభంపై చర్చకు కేంద్రం ఇష్టపడడం లేదు. చర్చకు డిమాండ్ చేస్తున్న సమయంలో ప్రధాని మోదీ పార్లమెంట్ నుంచి ఎలా పారిపోయారో మీరు చూశారు. ఒకవేళ పశ్చిమాసియా సంక్షోభంపై చర్చ జరిగితే ప్రధాని మోదీ పార్లమెంట్‌కు రాలేరు" అని రాహుల్ వ్యాఖ్యానించారు. అలాగే వీబీ జీ రామ్ జీ అమలు నేపథ్యంలో కేంద్ర సర్కార్‌పై కాంగ్రెస్ మండిపడింది. ఈ పథకం వివరాలు ఇంకా రూపొందుతున్నాయని, ఇది మోదీ ప్రభుత్వ వేగవంతమైన విధానానికి సరైన ఉదాహరణ అని పేర్కొంది. అలాగే పశ్చిమాసియాలో చిక్కుకున్న భారతీయులను వెనక్కి రప్పించేందుకు భారత్ అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని అన్నారు. గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న సుమారు కోటి మంది భారతీయుల రక్షణకు చర్యలు చేపట్టినట్టు వివరించారు. కాగా, పశ్చిమాసియా సంక్షోభం పార్లమెంట్ ఉభయ సభలను సోమవారం కుదిపేసింది. పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై చర్చకు డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు రాజ్యసభ, లోక్‌సభలో నిరసనలు చేపట్టాయి. దీంతో పార్లమెంట్ ఉభయ సభలు మంగళవారానికి వాయిదా పడ్డాయి. ఈ క్రమంలో కాంగ్రెస్ నేతృత్వంలోని విపక్షాలు సభా కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తున్నాయని బీజేపీ ఎంపీలు ఆరోపించారు.

# ప్రజాసేవలో ఎప్పుడూ పోలీసులే ముందు

(మొదటి పేజీ తరువాయి)

విశ్లేషించుకున్నట్లు సిఎం తెలిపారు. ఛాలెంజ్ లు రెండు రకాలు.. ఒకటి టెక్నికల్ ఛాలెంజ్, రెండోది అడాప్టివ్ఛాలెంజ్ అన్నారు. రిసోర్సెస్, సమయాన్ని కేటాయిస్తే టెక్నికల్ ఛాలెంజ్ ను అధిగమించవచ్చన్నారు. కానీ అడాప్టివ్ఛాలెంజ్ విషయంలో ఎదురైన సమస్య లోతును అర్థంచేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఏ రాష్ట్రమైనా అభివృద్ధి చెందాలంటే శాంతిభద్రతలు అదుపులో ఉండాలన్నారు. రాష్ట్రంలో పాలసీ పెరాలసిస్ ఉండకూడదనే తెలంగాణ రైజింగ్ 2047 పాలసీ డాక్యుమెంట్ ను ఆవిష్కరించుకున్నామని తెలిపారు. పెట్టుబడులను ఆకర్షించడానికి ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న 2100కి.మీ ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ గా పరిగణించుకుంటున్నాం అని అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ ఎకానమిగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నామని అన్నారు. దేశంలో ఢిల్లీ అత్యంత కాలుష్య నగరంగా మారింది. ట్రాఫిక్ సమస్యలతో బెంగుళూరు నగరంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముంబై, చెన్నై నగరాలు వరదలతో సతమతమవుతున్నాయి.

అలాంటి మెట్రోపాలిటన్ నగరాల నుంచి మనం గుణపాఠం నేర్చుకోవాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఏ సమస్య వచ్చినా ప్రజలు మొట్టమొదట సహాయం కోసం ఎదురు చూసేది పోలీసుల కోసమేనని అన్నారు. ఒకప్పుడు తీవ్రవాదం ఒక సమస్యగా ఉండేది.. ఇందుకోసం ఆక్టోపస్, గ్రేహౌండ్స్ లాంటి వ్యవస్థలు తీసుకొచ్చారు. అవినీతిని నిరోధించేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ఫిజికల్ క్రైమ్ నిరోధించేందుకు ఇప్పటి వరకు వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నాం. కానీ ఇప్పుడు నేర స్వరూపమే మారిపోయింది. సైబర్ క్రైమ్ పెరిగిపోతున్న ఈ రోజుల్లో మన సిస్టం ను అప్ గ్రేడ్ చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సాంకేతిక నైపుణ్యం ఉన్న అధికారులను నియమించుకోవాల్సిన అవసరం ఉంది. ఉన్న సిబ్బంది, అధికారులను అప్ గ్రేడ్ చేసుకోకపోతే నేరాలను నిరోదించలేమని గుర్తు చేశారు.రిట్రీట్ కార్యక్రమం ద్వారా మీ సమస్యలను గుర్తించి విశ్లేషించుకున్నారు. సమస్య ఏమిటో గుర్తిస్తే 50 శాతం సమస్య పరిష్కారం అయినట్లే. సైబర్ క్రైమ్, నార్కోటిక్స్, రిక్రూట్ మెంట్, ఇతర అంశాలకు సంబంధించి వివిధ సమస్యల పరిష్కారానికి మీరు కొన్ని ప్రతిపాదనలు అందించారు. సమస్యల పరిష్కారానికి మీరు అందించిన ప్రతిపాదనలపై విశ్లేషించాల్సిన అవసరం ఉంది. ఇందుకోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో ఒక అధికారుల కమిటీ ఏర్పాటు చేస్తాం.. మీ ప్రతిపాదనలపై కమిటీలో విశ్లేషించి చట్టం రూపంలో మా ముందుకు తీసుకు రండి. సాధ్యాసాధ్యాలను పరిశీలించి ప్రభుత్వం దానిపై నిర్ణయం తీసుకుంటుంది. పోలీస్ శాఖలో సిబ్బంది రేషనలైజేషన్ చేసుకుని జనాభా ప్రాతిపదికన పోలిసింగ్ ఉండేలా ప్రణాళికలు రూపొందించాలి. అవసరమైన నిధులు ఇచ్చేందుకు ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంది. మీ పనితీరు ఆధారంగానే పోస్టింగులు ఉంటాయి. ప్రతీ ఏటా డిసెంబరులో రిట్రీట్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసునేలా ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు.

# అత్యున్నతంగా యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ

**తొలి అక్షరం/హైదరాబాద్,మార్చి 9 :** అంతర్జాతీయ ప్రమాణాలతో అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. వర్సిటీ నిర్మాణాలకు సంబంధించిన పలు డిజైన్లను పరిశీలించారు. దీనికి సంబంధించి అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని సదుపాయాలతో స్పోర్ట్స్ వర్సిటీ నిర్మాణాలు ఉండాలి. ఒలింపిక్స్, కామన్వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలి. ఒలింపిక్స్‌లో తెలంగాణ క్రీడాకారులు సత్తా చాటేలా చర్యలు తీసుకోవాలి. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియాన్ని ఆధునికీకరించాలి. అదేవిధంగా గచ్చిబౌలి ఔట్‌డోర్ స్టేడియాన్ని పునరుద్ధరించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. క్రీడాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పనపై అధికారులతో చర్చించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీలో సౌకర్యాల కల్పన, అన్ని రకాల క్రీడలకు మైదానాల ఏర్పాటుపై చర్చించారు. ఒలింపిక్స్ లక్ష్యంగా క్రీడాకారులకు శిక్షణ ఇచ్చేందుకు వీలుగా రాష్ట్రంలో అన్ని సౌకర్యాలతోపాటు స్పోర్ట్స్ యూనివర్సిటీ నిర్మాణాలు ఉండాలని సీఎం అన్నారు. గచ్చిబౌలి ఔట్ డోర్ స్టేడియంను పునరుద్ధరించడం తో పాటు, స్టేడియం ఆవరణలో ఇండోర్ స్టేడియం, యూనివర్సిటీ కాంప్లెక్స్, హాస్టల్ భవనాలు, అన్ని రకాల క్రీడా మైదానాలు, శిక్షణకు అవసరమైన ఇతర సౌకర్యాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈసందర్భంగా నిర్మాణాలకు సంబంధించి పలు డిజైన్లను పరిశీలించారు. డిజైన్లకు సంబంధించి అధికారులకు పలు సూచనలు చేసారు. ఒలంపిక్స్, కామన్ వెల్త్ క్రీడలకు తెలంగాణ ఆతిథ్యం ఇచ్చేలా, ఒలంపిక్స్ లో తెలంగాణ క్రీడాకారుల సత్తా చాటడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. నగరంలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి స్టేడియం, ఎల్బీ స్టేడియం, సరూర్ నగర్ స్టేడియంలను భవిష్యత్ అవసరాలు, శిక్షణ, పోటీలకు అనుగుణంగా ఆధునీకరించాలని అధికారులను ఆదేశించారు. మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీఎం సలహాదారు వేంనరేందర్ రెడ్డి, శాప్ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సిఎం ప్రిన్సిపల్ సెక్రటరీలు శ్రీనివాస రాజు, శేషాద్రి, ఎండీ సోనీ బాలదేవి, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ జి. కిషోర్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కవితకు మళ్లీ నోటీసులు!

**తొలి అక్షరం/న్యూఢిల్లీ,మార్చి 9:** ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కల్వకుంట్ల కవిత సహా 23 మంది నిందితులకు ఢిల్లీ హైకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. రౌస్ అవెన్యూ కోర్టు నిందితులకు ఊరట కలిగిస్తూ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ సిబిఐ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన కోర్టు, ప్రతివాదులకు నోటీసులు జారీ చేస్తూ.. తదుపరి విచారణను మార్చి 16వ తేదీకి వాయిదా వేసింది. సీబీఐ తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మోహతా వాదనలు వినిపించారు. ఇటీవల ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టు ఈ కేసులో నిందితులుగా ఉన్న ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, కల్వకుంట్ల కవితతో పాటు మొత్తం 23 మందిపై సీబీఐ అభియోగాలను డిశ్చార్జ్ చేస్తూ వారికి ఊరట కలిగించడం తెలిసిందే. అయితే ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో నిందితులకు అనుకూలంగా రౌస్ అవెన్యూ కోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ సీబీఐ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. కేసు విచారణలో భాగంగా నిందితులపై ఉన్న అభియోగాలను మరింత లోతుగా పరిశీలించాల్సిన అవసరం ఉందని, కింది కోర్టు నిర్ణయంపై స్టే ఇవ్వాలని సీబీఐ కోరింది. దీనిపై స్పందించిన ఢిల్లీ హైకోర్టు, నిందితులు విచారణకు హాజరు కావాలని ఆదేశిస్తూ నోటీసులు జారీ చేసింది. ఇటీవల రౌస్ అవెన్యూ కోర్టు లిక్కర్ స్కాం కేసులో కీలక వ్యాఖ్యలు చేసింది. దర్యాప్తు సంస్థలు సీబీఐ, ఈడీ దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లలోని కొన్ని అంశాలపై స్పష్టత లేదని, సాక్ష్యాధారాల సేకరణలో జాప్యం జరుగుతోందని కోర్టు అభిప్రాయపడింది. కొందరు నిందితులు తమపై ఉన్న కేసులను కొట్టివేయాలని (డిశ్చార్జ్) కోరుతూ దాఖలు చేసిన పిటిషన్లపై రౌస్ అవెన్యూ కోర్టు సానుకూలంగా స్పందించింది. కేవలం ఆరోపణలతో కేసు దర్యాప్తు జరిగిందని, తగినన్ని ప్రాథమిక ఆధారాలు లేకుండా నిందితులను ఎక్కువ కాలం జైల్లో ఉంచడం లేదా విచారణను సాగదీయడం సరికాదని కోర్టు పేర్కొంది. ఈ క్రమంలోనే 23 మంది నిందితులపై ఉన్న అభియోగాలను కోర్టు కొట్టివేస్తూ వారి లిక్కర్ పాలసీ కేసు నుంచి విముక్తి కల్పించింది. సీబీఐ ఇప్పుడు ఈ అంశాలన్నింటినీ ఢిల్లీ హైకోర్టులో సవాలు చేస్తోం ది. ఆప్ ప్రభుత్వం హయాంలో జరిగిన లిక్కర్ పాలసీ స్కామ్‌లో భారీగా ముడు పులు చేతులు మారాయని, దీని వెనుక ఉన్న 'సౌత్ గ్రూప్', ఇతర రాజకీయ నేతల ప్రమేయాన్ని నిరూపించడానికి మరింత లోతుగా దర్యాప్తు జరగాలని సీబీఐ వాది స్తోంది. ఈ కేసు తదుపరి విచారణ మార్చి 16కు ఢిల్లీ హైకోర్టు వాయిదా వేసింది.

# సీఈసీపై అభిశంసన..
# తీర్మానానికి సిద్ధమవుతున్న విపక్షాలు

- ఈ వారంలోనే నోటీసు ఇచ్చే అవకాశం



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,మార్చి 9:** చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేశ్‌కుమార్ తొలగింపునకు పార్లమెంట్‌లో తీర్మానం ప్రవేశపెట్టేందుకు ప్రతిపక్ష పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఈ తీర్మానానికి సంబంధించిన ముసాయిదా సిద్ధమైందని, ఈ వారంలోనే నోటీసు ఇచ్చే అవకాశముందని తెలిసింది. ప్రతిపక్షాలన్నీ కలిసికట్టుగా, ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నాయని టీఎంసీ సీనియర్ ఎంపీ వెల్లడించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా అభిశంసన తీర్మానం ముసాయిదా సిద్ధమైందని అన్నారు. ఒకేసారి రెండు సభల్లో ప్రవేశపెట్టేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు.ఎన్నికల కమిషనర్ తన పదవిని పూర్తిగా దుర్వినియోగం చేశారని ఆ నాయకుడు ఆరోపించారు. ఇండియా కూటమిలోని ఇతర పార్టీలన్నీ ఈ అభిశంసన తీర్మానానికి అనుకూలంగా ఉన్నాయని, ముసాయిదా రూపకల్పనలో భాగస్వామ్యమైనాయని తెలిసింది. తీర్మానంపై అన్ని పార్టీల నాయకులు ఎంపీల సంతకాలను సేకరించనున్నారు. లోక్‌సభ నుంచి కనీసం 100, రాజ్యసభ నుంచి కనీసం 50 మంది సంతకాలు అవసరమని ఓ నాయకుడు తెలిపారు. పార్లమెంట్ ద్వారా హైకోర్టు లేదా సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించేందుకు అనుసరించే విధానమే సీఈసీ తొలగింపునకు కూడా వర్తిస్తుందని అన్నారు.

# ఇరాన్ కొత్త సుప్రీంగా మొజ్తబా

(మొదటి పేజీ తరువాయి)

అసెంబ్లీ నిపుణుల బృందం ఎన్నుకుంది.ఇందులో 88 మంది ఇస్లాం మత గురువులు ఉంటారు. వీరందరూ కలిసి ఆదివారం సమావేశమై కొత్త సుప్రీం లీడర్ కోసం చర్చ జరిపారు. మెజారిటీ సభ్యులు మొజ్తాబా వైపు మొగ్గు చూపారు. కొందరు సభ్యులు వారసత్వ నాయకత్వాన్ని వ్యతిరేకించినప్పటికీ.. మెజారిటీ ఉండటంతో మొజ్తాబానే ఎన్నుకున్నారు. ఒకవైపు ఇరాన్‌పై దాడులు కొనసాగుతున్నా, మిడిల్ ఈస్ట్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నప్పటికీ కొత్త లీడర్ ఎంపికను ఇరాన్ పూర్తి చేసింది. అతడు, ఎప్పటినుంచి బాధ్యతలు స్వీకరిస్తారో తెలియరాలేదు. మొజ్తాబాకు విదేశాల్లో భారీగా ఆస్తులున్నాయి. అతడికి లండన్‌లో దాదాపు 2,500 కోట్లకుపైగా ఆస్తులున్నట్లు అంచనా. కెన్సింగ్‌టన్ ప్యాలెస్‌లో అతడికి ఖరీదైన అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. 2014 నుంచి లండన్‌లో ఆస్తులు కలిగి ఉన్నాడు. అక్రమ చమురు అమ్మకాల ద్వారా ఇదంతా సంపాదించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇక ఇటీవలి పరిణామాల నేపథ్యంలో లండన్‌లోని అతడి ఆస్తులపై ఇజ్రాయెల్, అమెరికా నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. అతడి ఆస్తులకు భద్రతాపరమైన ముప్పు ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు మొజ్తాబా ఎంపికను అమెరికా, ఇజ్రాయెల్ అంగీకరించడం లేదు. కొత్త సుప్రీం లీడర్‌ను ఎన్నుకునేముందు తమ అనుమతి తీసుకోవాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచించారు. అలాగే కొత్త లీడర్ ఎవరైనా సరే అంతం చేస్తామని ఇజ్రాయెల్ ఇదివరకే ప్రకటించింది.

# తెలంగాణ నుంచి ఇద్దరు రాజ్యసభకు ఏకగ్రీవం

(మొదటి పేజీ తరువాయి)

ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ తరఫున వేం నరేంద్ర రెడ్డి, అభిషేక్ మను సింఘ్వీలు రాజ్యసభకు ఎన్నికైనట్లు ఆయన తెలిపారు. అందుకు సంబంధించిన పత్రాలను వీరికి అందజేసినట్లు తెలిపారు. అభిషేక్ మను సింఘ్వీ తరఫున అడ్వకేట్ సుందర్ చౌహాన్ అందుకున్నారు. వేం నరేందర్ రెడ్డి అసెంబ్లీ కార్యాలయానికి వచ్చి ధృవీకరణ పత్రం స్వీకరించారు. రాజ్యసభలో పలువురి సభ్యుల పదవి కాలం ఏప్రిల్‌లో ముగియనుంది. ఈ నేపథ్యంలో ఇటీవల కేంద్ర ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. గురువారంతో నామినేషన్ల ప్రకియ ముగిసిన సంగతి తెలిసిందే. కాంగ్రెస్ తరఫున తెలంగాణ నుంచి అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్ రెడ్డి నామినేషన్లు దాఖలు చేశారు. తెలంగాణ అసెంబ్లీలో ఏర్పాటు చేసిన రాజ్యసభ ఎన్నికల కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఉపేందర్ రెడ్డికి వీరు తమ నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్‌తోపాటు పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఇక.. సాయి అనే వ్యక్తి సైతం ఈ రాజ్యసభ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేశారు. అతడి అభ్యర్థిత్వాన్ని ప్రతిపాదిస్తూ 10 మంది ఎమ్మెల్యేల సంతకాలు లేకపోవడంతో.. శుక్రవారం ఆ నామినేషన్‌ను తిరస్కరించారు. అలాగే ఇతరులు ఎవ్వరూ నామినేషన్ల దాఖలు చేయలేదు. దీంతో కాంగ్రెస్ నుంచి నామినేషన్ల దాఖలు చేసిన అభిషేక్, వేం నరేందర్ రెడ్డి ఎన్నిక ఏకగ్రీవమైంది.

# తిరుమల లడ్డూకు నెయ్యి కొరత లేదు

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన నెయ్యి కొనుగోలు విధానం మూడంచెలుగా జరుగుతోంది. ఒకే సంస్థపై ఆధారపడకుండా మూడు వేర్వేరు సంస్థల ద్వారా నెయ్యి సరఫరా జరుగుతోంది. అందుకు తితిదే ముందస్తు చర్యలు చేపట్టింది. ప్రస్తుతం భక్తులకు పంపిణీ చేయడానికి సుమారు 7 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధంగా ఉన్నాయి. వేసవి సెలవుల నేపథ్యంలో తిరుమలలో భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. తితిదే వద్ద నెయ్యి నిల్వలు లేవని, శ్రీవారి కైంకర్యాలు, లడ్డూ ప్రసాదాల తయారీకి ఆటంకం కలుగుతోందని వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మవద్దు' అని భక్తులకు విజ్ఞప్తి చేసింది.

# రైతుబంధు పథకం బంద్...రాహుల్ బంద్ స్టార్

(మొదటి పేజీ తరువాయి)

సన్మానించారు. అనంతరం కేటీఆర్ మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యం అంటే ఇళ్లు కూలగొట్టడమేనా అని ప్రశ్నించారు. మూడో పంటకు రైతు బంధు వేయాలన్నారు. కానీ నేటికి మూడో నెల వచ్చిన రైతు బంధు వేయడం లేదని రేవంత్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్థిక కష్టాలు ఉన్న మాట నిజమైతే రూ.లక్షన్నర కోట్లతో మూసి సుందరీకరణ ఎవరు చేయమన్నారంటూ రేవంత్ ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. రైతు బంధు మీద దృష్టి పెట్టు.. అంతేకానీ రాహుల్ బంధు మీద కాదంటూ సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ చురకలంటించారు. ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వికలాంగుల ఇళ్లను సైతం నిర్దాక్షిణ్యంగా కూల్చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి సొంత ఇల్లు, ఆయన సోదరుడి ఇల్లు నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని.. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రభుత్వాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ నిలదీశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలుపై కేటీఆర్ వ్యంగ్య బాణాలు సంధించారు. వంద రోజుల్లో అమలు చేస్తామని చెప్పి.. వెయ్యి రోజులు కావస్తున్నా అతీగతీ లేదని విమర్శించారు. ఆడబిడ్డల పెళ్లికి తులం బంగారం, రైతులకు పంట బోనస్, మహిళలకు నెలకు రూ. 2,500 ఇస్తామన్న హామీలు ఏమయ్యాయని ప్రభుత్వాన్ని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు.

# గవర్నర్ జిష్ణుదేవ్ వర్మకు ఘనంగా వీడ్కోలు

**తొలి అక్షరం/హైదరాబాద్,మార్చి 09:** మహారాష్ట్ర గవర్నర్ గా బదిలీపై వెళ్తున్న సందర్భంగా గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ , కుటుంబ సభ్యులకు ప్రభుత్వం ఘనంగా వీడ్కోలు పలికింది. బేగంపేట ఎయిర్ పోర్ట్ లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి, స్పెషల్ చీఫ్ సెక్రటరీ దాన కిషోర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ రాహుల్ బొజ్జ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్చాను అందజేసి వీడ్కోలు పలికారు. వారితో కరచాలనం చేసి ఆత్మీయంగా పలకరించారు.

# వెలుగుమట్ల బాధితులతో కవిత ధర్నా

(మొదటి పేజీ తరువాయి)

జాగృతి అధ్యక్షురాలు కవిత దిగారు. ఈ క్రమంలో పోలీసులు ఆమెను అదుపులోకి తీసుకున్నారు. కవితతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్, పలువురు ఆందోళనకారులను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు. ఖమ్మం నగరంలో వెలుగుమట్ల ప్రాంతానికి చెందిన భూదాన్ యజ్ఞ బోర్డు భూముల నిర్వాసితులతో కలిసి కవిత సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అంబేద్కర్ సెంటర్ వరకు కొనసాగింది. అక్కడికి చేరుకున్న అనంతరం కవిత అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పించారు. ఈ ర్యాలీ అనంతరం నిర్వాసితులు ఖమ్మం జడ్పీ సెంటర్ వద్ద ఆందోళనకు దిగారు. తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వారు నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనలో భాగంగా కొంతమంది నిర్వాసితులు రాస్తారోకో నిర్వహించి వాహనాలను అడ్డుకున్నారు. దీంతో జడ్పీ సెంటర్ పరిసరాల్లో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు భారీగా మోహరించారు. ఉద్రిక్త పరిస్థితులు తలెత్తడంతో పోలీసులు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత, బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ చైర్మన్ విశారదన్‌తో పాటు పలువురు నిర్వాసితులను పోలీసులు అరెస్ట్ చేశారు. అనంతరం కవితను నేలకొండపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆందోళనల నేపథ్యంలో ఖమ్మం జడ్పీ సెంటర్ పరిసరాల్లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకునేందుకు చర్యలు చేపట్టారు.

## ప్రజా పాలనా ప్రగతి పాలనా99లో భాగంగా వైద్య శిబిరం ప్రారంభించిన నెక్కొండ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి



**తొలి అక్షరం/నెక్కొండ మార్చి 9:** నెక్కొండ మండల కేంద్రంలోని ప్రజా పాలనా ప్రగతి పాలనా 99లో భాగంగా నెక్కొండ లోని గుండ్రపల్లి రోడ్డు లో ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం లో వైద్య శిబిరంని ప్రారంభించిన, నెక్కొండ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి స్థానిక సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ మహేందర్ సార్ డాక్టర్ నుశ్రత్ తన్విర్ డ్యూటీ డాక్టర్ సుమన్, మాజీ పిఎసిఎస్ చైర్మన్ కొమ్మారెడ్డి రవీందర్ రెడ్డి, వివిధ డాక్టర్లు ప్రజలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ఏ న్ మ్ లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం

- చెరువు ముందు తండా గ్రామ సర్పంచ్ కున్సోత్ మంగమ్మ -శ్రీనివాస్.




**తొలి అక్షరం/నెక్కొండ మార్చి 9:** వరంగల్ నెక్కొండ మండల కేంద్రంలోని చెరువు ముందరి తండ గ్రామ పంచాయతి విలేజ్ పార్కు లో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక కార్యక్రమం చెరువు ముందరి తండా గ్రామ సర్పంచ్ కునుసోతు మంగమ్మ - శ్రీను ఉపసర్పంచ్ మూడు మంగమ్మ - రాజేందర్ వార్డు మెబర్లు పాల్తీయ శంకర్, కార్యదర్శి సురేష్, బోడ భద్రు, శ్రీను, లాలు ఈరమ్మ,జరూపుల హాతీరం, కునుసోతు సుధాకర్, శారద ,శ్రీను,తదితరులు పాల్గొన్నారు.

## మార్చి 13న హైదరాబాదులో సామూహిక నిరాహార దీక్షలు జయప్రదం చేయండి

**వికలాంగుల పెన్షన్ 6000లకు పెంచాలి**

**ఎంపిక అయిన లబ్ధిదారులకు పరికరాలు వెంటనే పంపిణి చేయాలి**

**బడ్జెట్లో నిధుల కేటాయింపులు పెంచాలి**

**వనం ఉపేందర్ భువనగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి**




**తొలి అక్షరం/రామన్నపేట మార్చి 9:** వికలాంగుల పెన్షన్ 6000లకు పెంచాలని,ఎంపిక అయిన లబ్ధిదారులకు పరికరాలు వెంటనే పంపిణి చేయాలని,బడ్జెట్లో నిధుల కేటాయింపులు పెంచాలని డిమాండ్ చేస్తూ మార్చి 13 హైదరాబాద్లో సామూహిక నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపినారు

## ఎమ్మెల్యేను కలిసిన నాయకులు



**తొలి అక్షరం/రామన్నపేట మార్చి 9:** నకిరేకల్ శాసనసభ్యులు వేముల వీరేశం ని మర్యాదపూర్వకంగా ఆయన నివాసంలో కలిసిన వలిగొండ - రామన్నపేట మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమా నాయక్ వైస్ చైర్మన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి వారితో డైరెక్టర్లు దానయ్య గౌడ్, కర్నాటి లింగ స్వామి, చంద్రయ్య, దామోదర్ రెడ్డి,ముత్యాలు, పాల్గొన్నారు.

## భారతీ మండల సమావేశం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు





**తొలి అక్షరం/నెక్కొండ మార్చి 9:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలో భారతి మండల సమావేశం ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది, ఈ సమావేశానికి మండల సమాఖ్య అధ్యక్షురాలు రజిత అధ్యక్షత వహించగా, ముఖ్యఅతిథిగా అడిషనల్ డిఆర్డిఓ శ్రీమతి రేణుకా దేవి హాజరై మాట్లాడు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని ప్రోత్సాహకాలను మరియు పథకాలు సమర్ధవంతంగా వినియోగించుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని చెప్పారు, మహిళా దినోత్సవ సందర్భంగా కేక్ కట్ చేయడం జరిగింది, ప్రతిభ కనబరిచిన వివోఏలు, గ్రామ సంఘాలకు మరియు మహిళా ఉద్యోగులను సన్మానించడం జరిగింది, కార్యక్రమంలో జిల్లా సమాఖ్య కోశాధికారి స్వప్న, ఏపీఎం కిరణ్ కుమార్, ఏ పి యమ్ రాజు, ఐసిడిఎస్ సూపర్వైజర్ భాగ్య, మండల సమాఖ్య పాలకవర్గం, సీసీలు, సిబ్బంది, గ్రామ సంఘ అధ్యక్షులు మరియు వివోఏ లు పాల్గొన్నారు.

## తడుకుల భాస్కర్ మృతదేహానికి నివాళులర్పించిన బంజరపల్లి సర్పంచ్ భూక్య రమేష్ రాథోడ్





**తొలి అక్షరం/నెక్కొండ మార్చి 9:** వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రంలోని బంజరపల్లి గ్రామానికి చెందిన తడుగుల భాస్కర్ మృతదేహానికి పూలమాలవేసి నివాళు లర్పించిన సర్పంచ్ రమేష్ రాథోడ్ మరియు ఉప సర్పంచ్ ఎర్ర సుజాత రాజు బంజర్ పల్లి గ్రామ నివాసి అయిన తడుగుల భాస్కర్ ఇటీవల అనారోగ్య కారణంగా మరణించడం జరిగింది. భాస్కర్ కుమారులను ,కుటుంబాన్ని పరామర్శించడం జరిగింది. సర్పంచ్ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేయడం జరిగింది... ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎర్ర సుజాత రాజు వార్డ్ నెంబర్ ఒరే మహేశ్వరి రవి, ఉప స్వామి సతీష్ విక్రమ్ యాకన్న మరియు కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

## మహోదయ నగర్ మహర్దశ.. అభివృద్ధి పనులకు శ్రీకారం



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో మార్చి 9:** మహోదయ నగర్ కు మహర్దశ పట్టణన్నట్లు స్థానిక వార్డు కౌన్సిలర్ గాడి పెల్లి నాగేశ్వరరావు అన్నారు. సోమవారం పురపాలక సంఘ పరిధిలోని 14వ వార్డులో సిసి రోడ్ల నిర్మాణానికి ముందడు కౌన్సిలర్ల పర్యవేక్షణ చేసి అభివృద్ధి పనుల నిమిత్తం కీలక అంచనాలు రూపొందించారు. రామచంద్రపురం 1 & 2 కాలనీలు పాత మహోదయ స్కూల్ లైన్లలో నూతనంగా నిర్మించనున్న సిసి (జజ) రోడ్ల కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేశారు. కార్యక్రమంలో స్థానిక 14వ వార్డు కౌన్సిలర్ గాడిపల్లి నాగేశ్వర్ రావు పాల్గొని, రోడ్ల నిర్మాణానికి అవసరమైన అంచనాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు 13వ వార్డు కౌన్సిలర్ కాట భాస్కర్ కూడా విచ్చేసి పనుల నాణ్యత, ప్రణాళికపై చర్చించారు. ఈ కార్యక్రమంలో అధికారులతో పాటు స్థానికులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు వర్క్ ఇన్స్పెక్టర్ మహేష్ , కాంట్రాక్టర్ రావుల సతీష్ రెడ్డి, స్థానికులు రచకట్ల రవి, గంద్రకోటి కుమార్, డోలి శివ, రవి తదితరులు పాల్గొన్నారు.



## చెరువులో జేసీబీలతో తవ్వకాలు అధికారుల నిర్లక్ష్యమా?



**తొలి అక్షరం/నెక్కొండ మార్చి 9:** వరంగల్ జిల్లా నెక్కొండ మండలం చిన్న కొర్పోల్ గ్రామంలో ఉన్న ఊర చెరువులో ఎలాంటి అనుమతులు లేకుండానే భారీ యంత్రాలతో తవ్వకాలు చేపడుతున్న ఘటన స్థానికంగా ఆందోళనకు దారి తీసింది. చెరువు పరిధిలో కొందరు ఆక్రమణదారులు జేసీబీలతో బావులు తవ్వడం, ఇప్పటికే ఉన్న బావుల్లోని పూడికను తొలగించడం జరుగుతుండటంతో గ్రామస్తులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.చెరువు వంటి ప్రజా సంపదలో ఇలాంటి పనులు అధికారుల అనుమతి లేకుండా జరగడం ఏమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. చెరువులు గ్రామాలకు జీవనాధారం కాగా, వాటిలో అక్రమ తవ్వకాలు కొనసాగితే భవిష్యత్తులో పర్యావరణానికి, నీటి నిల్వలకు తీవ్ర నష్టం కలిగే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికే తెలంగాణ రాష్ట్రంలో జిల్లా, మండల, గ్రామ స్థాయిలో హైడ్రా తరహా కఠిన వ్యవస్థ అవసరం ఉందని ప్రజలు కోరుతున్న తరుణంలో చెరువుల వంటి ప్రభుత్వ భూముల్లో ఇలాంటి అక్రమాలు జరగడం బాధాకరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.కావున సంబంధిత రెవెన్యూ, పంచాయతీ రాజ్, నీటిపారుదల శాఖ అధికారులు వెంటనే స్పందించి చెరువులో జరుగుతున్న తవ్వకాలను నిలిపివేసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని చిన్న కొర్పోల్ ముదిరాజ్ సంఘం,అధ్యక్షులు సంఘ సభ్యులు, గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

- రుద్రా ఫౌండేషన్ చైర్మన్ పేరం గోపికృష్ణ







**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** శంకర కంటి ఆసుపత్రి నానక్ రామ్ గూడ, హైదరాబాద్ వారి సౌజన్యంతో రుద్రా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో హన్మకొండ హనుమాన్ నగర్ లో పి వి ఆర్ రెసిడెన్సి మైసమ్మ గుడి లేని హనుమాన్ టెంపుల్ ఎదురుగా పెగడపల్లి డబ్బాల దగ్గరలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు.తేది. 09-03-2026, సోమవారం రోజున సమయం: ఉవ 7-30 గంటల నుండి మవ 1-00 గంటల వరకు కొనసాగిన ఉచిత కంటి వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది.ఈ సందర్భంగా రుద్ర ఫౌండేషన్ చైర్మన్ పేరు గోపికృష్ణ మాట్లాడుతూ... రుద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు 60 మంది వాలంటీర్లతో కొనసాగుతుందని నిరుద్యోగ యువతీ యువకులకు ఉపాధి అవకాశాలు కూడా కల్పిస్తామని తెలియజేశారు.పెద్దలకు,వృద్ధులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తామని ఎంపిక చేసిన వారికి కంటిలో అద్దం (ఐ ఓ ఎల్) అమర్చే శస్త్ర చికిత్స తో పాటు భోజనం,వసతి సౌకర్యం ఉచితంగా శంకర కంటి ఆసుపత్రి- హైదరాబాద్ వారు సమకూర్చటం జరుగుతుందని తెలిపారు.ప్రయాణ సౌకర్యం ఉచితంగా అంద చేస్తున్నారని,ఆసుపత్రికి వచ్చేటప్పుడు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చి అదనంగా ఒక జత బట్టలు తెచ్చుకొనవలేనని తెలిపారు.ఒకసారి మీరు చికిత్స పొందిన తరువాత మీరు మీ ప్రక్కవారికి సమాచారం అందించి అవసరమైన వారిని కూడా శిబిరం వద్దకు తీసుకురావచ్చునని తెలిపారు.శంకర కంటి ఆసుపత్రి ద్వారా శస్త్ర చికిత్స చేయించుకున్నవారందరూ పునః పరీక్ష కొరకు అదే శిబిరం వద్దకు నిర్దేశించిన తేదిలో హాజరు కావలెనని,ఇతర వ్యాధులతో బాధపడుతున్నవారు,గుండె జబ్బులు,రక్తపోటు,న్యూరో,మధుమేహం,ఉబ్బసం వంటి వ్యాధి గ్రస్తులు,తప్పనిసరిగా అర్హులైన వైద్యుని ద్వారా శస్త్రచికిత్సకై అర్హత ధృవపత్రం తీసుకొని అవసరమైన మందులతో పాటు రావలెను.ఇంతకు ముందు ఆపరేషన్ చేయించుకున్నవారు పాత డిశ్చార్జి పత్రం తీసుకొని రావలెను.ఆపరేషన్ తరువాత డాక్టర్ గారి సలహాలు - సూచనలు తప్పనిసరిగా పాటించవలెనని,ఆపరేషన్ తరువాత డాక్టర్ డిశ్చార్జి,మందులు నల్ల కళ్ళ అద్దాలు ఇవ్వబడును అని ఈ సందర్భంగా తెలిపారు.

## చలో గన్ పార్క్ విజయవంతం చేయగలరు: జోగు అంజన్న



**తొలి అక్షరం/రామన్నపేట మార్చి 9:** ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ చీమ శ్రీనివాస్ ఆధ్వర్యంలో హైదరాబాదులోని గన్ పార్క్ వద్దకు ఉదయము 10 గంటలకు ప్రారంభమయ్యే మిలియన్ మార్చ్ లో పాల్గొనాలని రాష్ట్రంలోని నలుమూలల నుండి 33 జిల్లాల ఉద్యమకారులంతా కలసి పాల్గొనాలని తెలంగాణ రాష్ట్రం కోసం జరిగిన చారిత్రాత్మక మిలియన్ మార్చ్ 10 మార్చ్ 2011 ను స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ కొరకు అమరులైన వారిని గుర్తు చేసుకు నే కార్యక్రమానికి తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు నాయకురాలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఈ ప్రభుత్వము మేనిఫెస్టోలో పొందుపరిచినట్టుగా ఉద్యమకారులను గుర్తించడానికి కమిటీని వేసి గుర్తించి వారికి గుర్తింపు కార్డులను జారీ చేసి వారికి ఇస్తామన్న 250 గజాల ఇంటి స్థలాన్ని మరియు 25 వేల పెన్షన్ సౌకర్యాన్ని కల్పించి మా డిమాండ్స్ పదివేల కోట్లతో ఉద్యమకారులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ట్రైన్లలో బస్సులలో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేస్తూ ఈ కార్యక్రమం తదనంతరం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో జరగబోయే అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళా ఉద్యమకారునిలకు ఘనంగా సన్మానం జరుగుతుందని ఈ కార్యక్రమంలో ఉమ్మడి నల్లగొండ జిల్లా అధ్యక్షులు శీలం స్వామి యాదాద్రి జిల్లా అధ్యక్షులు కళాకారుల సంఘం మల్లం వెంకన్న సీనియర్ ఉద్యమకారులు కొండూరు సత్తయ్య కన్నెగంటి శ్రీనివాసచారి పల్లెర్ల రామచంద్రం పారుపల్లి నరసింహ తదితరులు పాల్గొన్నారు అని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు జోగు అంజన్న విలేకరుల సమావేశంలో తెలియజేశారు

## హై రిస్క్ గర్భిణీలకు ఆరోగ్య పరీక్షలు



**తొలి అక్షరం/బొమ్మనహాల్ మార్చి 09:-**మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి డా.చల్లా శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో బొమ్మణహల్,కురువల్లి,నేమకల్ గ్రామాలలో ఉన్న హై రిస్క్ గర్భిణీలకు ప్రత్యేక ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.ఈ గర్భిణీలు రెగ్యులర్‌గా తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని, అదే విదంగా సమయానికి పౌష్టికాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. మరియు నేడు (10-03-2026) బండూరు,ఉంతకల్లు,ఉద్దేహల్ గ్రామాల హై రిస్క్ గర్భిణీలకు కూడా ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వైద్యాధికారి తెలిపారు.ఈ అవకాశాన్ని గర్భిణీలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హెల్త్ సూపర్వైజర్ జె.రుక్మిణి, ఏఎన్ఎంలు,ఎంఎల్‌హెచ్పీలు,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాయచోటి నూతన కమిషనర్ బాధ్యతలు చేపట్టిన పి.రమణారెడ్డి



**తొలి అక్షరం/రాయచోటి మార్చి 09:-**రాయచోటి పురపాలక సంఘం,నూతన కమిషనర్ గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్ జి రవి బదిలీపై విజయవాడ సెక్రటేరియట్ బదిలీపై వెళ్లారు. విజయవాడ సెక్రటేరియట్ లో పనిచేస్తున్న మున్సిపల్ కమిషనర్ పి.రమణ రెడ్డి బాధ్యతలు చేపట్టారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి మున్సిపాలిటీలో ప్రజల సమస్యలు తమ దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు.మున్సిపాలిటీ పరిధిలో వార్డు వీధుల్లో మురికి కాలువలు చెత్తాచెదారం పై ప్రత్యేక దృష్టిసారిస్తామని రాయచోటి నూతన కమిషనర్ పి రమణారెడ్డి తెలియజేశారు

## ఇరవై వసంతాల వర్సిటీ పండుగలో విద్యార్థుల సందడి






**తొలి అక్షరం/కడప మార్చి 09:-**విశ్వవిద్యాలయం ఆవిర్భావానికి ఇరవై సంవత్సరాలు పూర్తైన సందర్భంగా నిర్వహించిన వర్సిటీ పండుగలో విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. దేశభక్తి గీతాలతో ప్రారంభమైన సాంస్కృతిక కార్యక్రమాలు సభికులను ఆకట్టుకున్నాయి.శాస్త్రీయ నృత్యాలు, కోలాటం, జానపద బాణీలో సాగిన పాటలకు విద్యార్థులు అందంగా అడుగులు కలిపి అందరినీ అలరించారు.అలాగే సినిమా పాటలకు చేసిన నృత్యాలు కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.విద్యార్థుల ఉత్సాహానికి ఆడియన్స్ కూడా స్పందించి స్టేజిపై ఉన్న వారికి జతగా స్టెప్పులు వేస్తూ కార్యక్రమాన్ని ఉత్సాహభరితంగా మార్చారు. దీంతో వర్సిటీ పండుగ ఆనందోత్సాహాల మధ్య ఘనంగా సాగింది.

# రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని 100 పడకలుగా మార్చాలి

**బడ్జెట్లో 40కోట్లు కేటాయించి నూతన భవనం నిర్మించాలి**

**16 నుండి సిపిఎం ఆధ్వర్యంలో నిరవధిక నిరహారదీక్షలు**

**సిపిఎం జిల్లా నాయకులు మేక అశోక్ రెడ్డి**

**సిపిఎం ఆధ్వర్యంలో రౌండ్ టేబులు సమావేశం**



**తొలి అక్షరం/రామన్నపేట మార్చ్ 9:** రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకలగా మార్చి రాబోవు అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలలో 40 కోట్ల రూపాయల కేటాయించి నూతన భవనం నిర్మించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మేక అశోక్ రెడ్డి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జిల్లెల పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రహదారి బంగ్లాలో సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రౌండ్ టేబుల్ సమావేశంలో పేద రాజకీయ పార్టీలు ప్రజాసంఘాల నాయకులు పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ 60 సంవత్సరాల క్రితం ఏర్పడిన రామన్నపేట ప్రభుత్వ ఆసుపత్రి పాత నియోజకవర్గ కేంద్రంగా సుమారుగా 8 మండలాలకు సేవలు అందించడం జరిగింది. ప్రస్తుతం కనీస సౌకర్యాలు లేక వైద్యం అందని ద్రాక్షలా మారిందని పేదలకు నాణ్యమైన వైద్యం అందడం లేదని అన్నారు. 40 సంవత్సరాల క్రితం నిర్మించిన భవనం కావడంతో వెచ్చులూడి రోగుల మీద పడి ప్రమాదాలకు కారణమవుతున్నాయని. అత్యవసర వైద్య సేవలు అందక అనేకమంది ప్రాణాలు కోల్పోతూన్నారన్నారు.కనీసం ఆధునిక వైద్య పరికరాలు లేక ప్రయివేటు ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వస్తుందన్నారు. రాబోయే రాష్ట్ర బడ్జెట్ లో 40కోట్ల రూపాయలు కేటాయించి నూతన భవనం నిర్మించాలని అన్నారు.**సిపిఎం ఆధ్వర్యంలో 16నుండి నిరవధిక నిరాహార దీక్షలు** ప్రభుత్వ ఆసుపత్రిని 100పడకల ఆసుపత్రిగా మార్చాలని సిపిఎం నిరవదిక నిరహారదీక్ష చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించేదాక దీక్షలు విరమించేది లేదని సిపిఎం చేసే ప్రజా పోరాటానికి మండల ప్రజలు మద్దతుగా నిలబడి కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. సిపిఎం మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం అధ్యక్షతన జరిగిన ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ ఉద్యమకారులు రెబ్బాస్ రాములు, టీడీపీ మండల నాయకులు ఫజల్ బేగ్, సిపిఐ మండల నాయకులు రచ్చ యాదగిరి,ఏంఆర్పిఎస్ మండల అధ్యక్షులు నోముల చిరంజీవి, సిపిఎం జిల్లా కమిటి సభ్యులు వనం ఉపేందర్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు బోయిని ఆనంద్, కందుల హనుమంతు, మండల కమిటి సభ్యులు గొరిగే సోములు,గన్నేబోయిన విజయభాస్కర్, ఎండీ రషీద్, బావండ్లపల్లి బాలరాజు, బోడిగే రజిత,పట్టణ శాఖ కార్యదర్శి మునికుంట్ల లెనిన్, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆవనగంటి స్వామి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివ కుమార్, దుబ్బాక సర్పంచ్ గట్టు నర్సింహా, పల్లె సత్యం,మేడి గణేష్,ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్, డివైఎఫ్ఐ మండల అధ్యక్షుడు శానగొండ రామచంద్రం, శాఖ కార్యదర్శులు గోగు లింగస్వామి, శానగొండ వెంకటేశ్వర్లు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# అత్యాధునికంగా వంద పడకల ఆసుపత్రినీ తీర్చిదిద్దుతాం..

**● షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ● నూతన ప్రభుత్వ ఆసుపత్రిలో సదుపాయాల కల్పనకు రూ.5.31 కోట్లు ● ఆసుపత్రిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన..**



**తొలి అక్షరం/షాద్ నగర్, మార్చి09:** షాద్ నగర్ వంద పడకల ఆసుపత్రిని అత్యధిక సదుపాయాలతో, పూర్తిస్థాయి వసతులతో నిర్మాణం చేపట్టబోతున్నామని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రకటించారు. లింగారెడ్డిగూడెం శివారులోని అలీసాబ్ గూడ వద్ద నిర్మిస్తున్న నూతన ప్రభుత్వ ఆసుపత్రిలో సదుపాయాల కల్పన కోసం అదనంగా రూ.5.31 కోట్లు ప్రభుత్వం ఇటీవలే మంజూరు చేసినట్లు ఆయన వెల్లడించారు. దీనికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలకు సోమవారం ఎమ్మెల్యే శంకర్, స్థానిక సర్పంచ్ ఎం సి రాజు, ఉప సర్పంచ్ అశోక్ ఆధ్వర్యంలో తన చేతులో మీదుగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ మంజూరైన నిధుల ద్వారా ఆసుపత్రిలో ప్రహరీ నిర్మాణం, సీసీ రోడ్ల ఏర్పాటు, మెడికల్ ల్యాండ్రీ, మోడ్రన్ కిచెన్ షెడ్, పార్కింగ్ షెడ్, మార్చురీ భవనం, బయో వేస్టేజ్ నిర్వహణ లను చేపడుతామని వివరించారు. నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరికి అత్యాధునిక వైద్యం ఇక్కడ అందుబాటులో ఉంటుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. త్వరలోనే నిర్మాణం పనులు పూర్తి చేసి ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి కార్యనిర్వహణ అధికారి డాక్టర్ విష్ణువర్ధన్, మండల పార్టీ అధ్యక్షుడు చల్లా శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలరాజు గౌడ్, మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర రెడ్డి, లింగారెడ్డి గూడా గ్రామ సర్పంచ్ ఎంసి ప్రవీణ్ కుమార్, ఉప సర్పంచ్ ఎర్రోళ్ల అశోక్, గ్రామస్తులు కందూరి అంజయ్య గౌడ్, రంగంపల్లి రమేష్ గౌడ్, వార్డు సభ్యుడు మల్లేష్ యాదవ్, వీరేష్ గౌడ్, నరేందర్ రెడ్డి, మంగలి రమేష్, అరుణ్ కుమార్, మహమ్మద్, గంటల శంకరయ్య, పక్కనే నరేష్, గోద జంగయ్య, ఖదీర్, విగ్నేష్, బాలరాజు గౌడ్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# క్రాంతి నగర్ కాలనీలో రూ.50 లక్షలతో అంతర్గత రోడ్డు పనులు

**● శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే నాయిని,మేయర్ గుండు సుధారాణి**






**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 52వ డివిజన్ క్రాంతి నగర్ కాలనీలో రూ.50 లక్షల వ్యయంతో చేపట్టనున్న అంతర్గత రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు.నగర మేయర్ గుండు సుధారాణి తో కలిసి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే,కాలనీలో రహదారి సౌకర్యాల మెరుగుదల కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు అందించేందుకు వరుసగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని అన్నారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే కాలనీవాసులకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తగ్గుతాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చాడ స్వాతి శ్రీనివాస్ రెడ్డి,డివిజన్ అధ్యక్షులు తడుక సుమన్ గౌడ్,సీనియర్ నాయకులు సుగుణాకర్ రెడ్డి,అశ్వన్,బాలు నాయక్,దేవేందర్ రెడ్డి,కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం: ఎమ్మెల్యే యశస్విని రెడ్డి





**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) మార్చి 9:** ప్రజా పాలన ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పాలకుర్తి నియోజకవర్గం, చెన్నూరు గ్రామంలో నిర్వహించిన సభలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ కారుపోతుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గ్రామ ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్క అర్హుడికి చేరాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. అధికారులు నిబద్ధతతో పనిచేస్తూ, ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి, యుద్ధప్రాతిపదికన పరిష్కరిం చాలని ఆదేశించారు. ప్రజా పాలన అంటే ప్రజల గడప వద్దకు పాలన చేరడమే అని ఆమె పేర్కొన్నారు.అనంతరం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలను ఎమ్మెల్యే ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను స్వయంగా పరిశీలించారు. చిన్నారుల ఆరోగ్యం విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని, వారికి పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందించాలని పాఠశాల సిబ్బందిని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, మహిళా సంఘాల సభ్యులు మరియు అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# షాద్‌నగర్‌లో ఉత్సాహంగా '5కే రన్'..

**● ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ● హాజరైన మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, కౌన్సిలర్లు, అధికారులు**






**తొలి అక్షరం/షాద్ నగర్, మార్చి09:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 99 ప్రణాళిక కార్యాచరణలో భాగంగా షాద్‌నగర్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో 5కే రన్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముఖ్య అతిథిగా హాజరై, జెండా ఊపి పరుగును ప్రారంభించారు. పట్టణ మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ఈ 5కే రన్, షాద్‌నగర్ ముఖ్య కూడలి వరకు సాగింది. ఆరోగ్య అవగాహన, ప్రభుత్వ లక్ష్యాల సాధన ధ్యేయంగా సాగిన ఈ పరుగులో విద్యార్థులు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. మార్గమధ్యలో యువత ఉత్సాహంగా నినాదాలు చేస్తూ పరుగును కొనసాగించారు. సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రణాళికల్లో ప్రజలను, ముఖ్యంగా యువతను భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. ఆరోగ్యవంతమైన సమాజ స్థాపనకు ఇలాంటి క్రీడా కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా గత రెండు సంవత్సరాలుగా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను, భవిష్యత్తు ప్రణాళికలను ప్రజలకు వివరించాలనే ఈ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో హాజరైన మున్సిపల్ చైర్మన్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# కేయూలో ఘనంగా ముగిసిన రూబీ జస్ట్

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రత్యేక ఉత్సాహంలో కార్యక్రమం నూతన ఉత్సాహంతో విద్యార్థినిలు కలల లోకాన్ని పరితపించిన రూబీ జస్ట్ 26 కార్యక్రమం సాంకేతిక పరిజ్ఞాన రూపంలో కొత్త రకమైన పోటీ తత్వాన్ని కనపరిచింది.ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపిన కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య కే బిక్షాలు.రూబీజెస్ట్--26 టెక్నికల్, కల్చరల్ ఫెస్ట్ విజయవంతంగా జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్యకే బిక్షాలు తెలిపారు.విద్యార్థినిలు ఎంతో కష్టపడి నిర్వహించుకున్న కార్యక్రమం అద్భుతంగా జరిగినందుకు ఆనందాన్ని వ్యక్తపరిచారు.ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన శాంతిభద్రతల మధ్యలో రెండు రోజుల రూబీ జస్ట్ 26 కార్యక్రమం నిర్వహించబడడం కళాశాలకు సరికొత్త నూతన ఉత్తేజాన్ని తెచ్చిపెట్టిందన్నారు. కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక అభినందలు తెలుపుతూ,కాకతీయ విశ్వవిద్యాలయ వీసీ ఆచార్య కే.ప్రతాపరెడ్డి రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం తో పాటు ఇతర అధికారులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ముగింపు కార్యక్రమంలో కాకతీయ యూనివర్సిటీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించిన రూబీజెస్ట్-26 టెక్నికల్, కల్చరల్ ఫెస్ట్ ఎంతో ఘనంగా, ఉత్సాహభరితంగా జరిగింది. ఈ వేడుకలో విద్యార్థినులు తమ సృజనాత్మకత,ప్రతిభ,సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శిస్తూ వివిధ టెక్నికల్ ఈవెంట్లలో చురుకుగా పాల్గొన్నారు. ప్రాజెక్ట్ ఎక్స్పో. టెక్నికల్ క్విజ్, కోడింగ్, పోస్టర్ ప్రెజెంటేషన్, బాజికల్ పజిల్స్ వంటి పలు పోటీలు నిర్వహించబడగా విద్యార్థినులు గొప్ప ఉత్సాహంతో పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. విజేతలుగా నిలిచిన విన్నర్స్,రన్నర్స్ కు ఒక ప్రత్యేక అవకాశాన్ని ప్రకటించారు.విద్యార్థినులు కోరుకున్న ఆధునిక సాంకేతిక రంగాలలో ఎడ్యుయాకోప్జ్ టెక్నాలజీస్ (ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఉచిత ఇంటర్నిప్ అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ఆ సంస్థ నిర్వాహకులు బాల కుమారేషన్ తెలిపారు. ఈ విధంగా విద్యార్థినులకు నూతన సాంకేతిక రంగాల్లో తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునే మంచి అవకాశాన్ని కల్పించినందుకు కళాశాల ప్లేస్మెంట్ ఆఫీసర్,అసిస్టెంట్ ప్రొఫెసర్ కిరణ్ కుమార్ కళాశాల ప్రిన్సిపాల్,సహా అధ్యాపకులు విద్యార్థినులు అభినందించారు.అంతేకాకుండా నిర్వహించిన కల్చరల్ ఫెస్ట్ కూడా విద్యార్థినుల కళా ప్రతిభను వెలికితీసింది.నృత్యాలు,సంగీత ప్రదర్శనలు, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు కళాశాల ప్రాంగణాన్ని ఆనందోత్సాహాలతో నింపాయి. సాయంత్రం నిర్వహించిన డీజే నైట్ అయితే ప్రత్యేక ఆకర్షణగా నిలిచి సంగీత ధ్వనులతో కళాశాల ప్రాంగణాన్ని ఉర్రూతలూగించింది. విద్యార్థినులు ఆనందంగా నృత్యాలు చేస్తూ ఆ క్షణాలను మరపురానివిగా మార్చుకున్నారు. ఈ సందర్భంగా మరో ప్రత్యేకతగా పదోన్నతి పొందిన సహా అధ్యాపకులు అయిన కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిక్షాలు అసోసియేట్ ప్రొఫెసర్ అర్చన లను కల్చరల్ ఫెస్ట్ వేదికపై సహా అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. వారి విద్యా సేవలను, కళాశాల అభివృద్ధికి చేసిన కృషిని గుర్తిస్తూ నిర్వహించిన ఈ సన్మానం కార్యక్రమం వేడుకకు మరింత గౌరవాన్ని చేకూర్చింది. మొత్తానికి రూబీజెస్ట్ 26 సాంకేతిక ప్రతిభను మాత్రమే కాకుండా సాంస్కృతిక వైభవాన్ని కూడా ప్రతిబింబిస్తూ కళాశాల చరిత్రలో చిరస్మరణీయమైన వేడుకగా నిలిచింది. రూబీజెస్ట్ కన్వీనర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ యం. సురేందర్ కల్చరల్ ఫెస్ట్ ముగింపు సమావేశంలో మాట్లాడుతూ ఈ రూబీజెస్ట్- 26 ఉత్సవాలు విజయవంతం కావడానికి తోడ్పాటు అందించిన వారందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు తెలిపారు. వివిధ విభాగాల వారీగా టెక్నికల్ కల్చరల్ ఫెస్ట్ లో నిర్వహించిన ఈవెంట్ లలో గెలుపొందిన వారి వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం నుండి గెలుపొందిన వారు ప్రాజెక్ట్ ఎక్స్పో 1వ స్థానం టి సావ్య (3వ సంవత్సరం),2వ స్థానం కి మేఘనా టీమ్ (3వ సంవత్సరం),3వ స్థానం బి. రుత్విక (2వ సంవత్సరం) పి.పి.టి. ప్రెజెంటేషన్ వై. గ్రీష్మ (3వ సంవత్సరం) పోస్టర్ ప్రెజెంటేషన్ 1వ స్థానం యం. సుశ్మిత (3వ సంవత్సరం),2వ స్థానం కే. అర్షిత (1వ సంవత్సరం) ఎలక్ట్రో సెన్స్ 1వ స్థానం ఎ. అక్షయ (3వ సంవత్సరం),2వ స్థానం యం. రష్మిత (2వ సంవత్సరం) రెసిస్టెన్స్ రిడిల్ 1వ స్థానం హెచ్ రాజిత (3వ సంవత్సరం),2వ స్థానం యం. హేమ 13వ సంవత్సరం) ఓహ్ మై టాట్ 1వ స్థానం వల్, ఉన్నతి (3వ సంవత్సరం),2వ స్థానం యం. మహేశ్వరి (2వ సంవత్సరం) ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ విభాగం నుండి గెలుపొందిన వారు 1వ స్థానం మోక్ష హారిక (3వ సంవత్సరం),2వ స్థానం కే. అంజలి పి. పి.టి ప్రెజెంటేషన్ 1వ స్థానం జీనత్ (3వ సంవత్సరం) 2వ స్థానం నాగలహరి (3వ సంవత్సరం) ఎలక్ట్రో ప్రోల్ 1వ స్థానం సింధుజ (4వ సంవత్సరం),2వ స్థానం నాగలహరి (3వ సంవత్సరం) 1వ స్థానం కే రుత్విక (3వ సంవత్సరం) 2వ స్థానం ఏ. ఐశ్వర్య (2వ సంవత్సరం) టెక్నికల్ క్విజ్ 1వ స్థానం రుత్విక (1వ సంవత్సరం),2వ స్థానం కె. రసన్య (2వ సంవత్సరం) 1వ స్థానం యం. వైష్ణవి (13వ సంవత్సరం),2వ స్థానం వీక్షిత (1వ సంవత్సరం) పోస్టర్ ప్రెజెంటేషన్ 1వ స్థానం యం. వైష్ణవి (13వ సంవత్సరం),2వ స్థానం కె. అర్షిత (1వ సంవత్సరం) కంప్యూటర్ సైన్స్, మెషిన్ టెన్నింగ్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు డేటా సైన్స్ విభాగాల నుండి. గెలుపొందిన వారు క్లూస్ కోడ్ విన్నర్స్ కె. వైష్ణవి 2వ సంవత్సరం (మెషిన్ లెర్నింగ్) యస్. ప్రసన్న -- 3వ సంవత్సరం (కంప్యూటర్ సైన్స్) బి. రుక్మిణి -- 3వ సంవత్సరం (కంప్యూటర్ వి. సిరివెన్నెల 13వ సంవత్సరం (కంప్యూటర్ పి. సాధ్విక 3వ సంవత్సరం (కంప్యూటర్ సి. హెచ్, హర్షిక - 3వ సంవత్సరం (కంప్యూటర్ సైన్స్) కోచ్ రైటింగ్ విన్నర్: ప్రసన్న -- 3వ సంవత్సరం (కంప్యూటర్) రన్నర్: వైష్ణవి 2వ సంవత్సరం (మెషిన్ లెర్నింగ్) రోడ్ డీబగ్గింగ్ విన్నర్: సోయితాల్య 4వ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ రన్నర్:వైష్ణవి-2వ సంవత్సరం మెషిన్ లెర్నింగ్ కోకో కప్స్ విన్నర్: ఎస్. ప్రసన్న - 3వ సంవత్సరం కంప్యూటర్ సైన్స్ రన్నర్: బి. వర్షిణి -- 1వ సంవత్సరం ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ పి.పి.టి ప్రెజెంటేషన్ విన్నర్స్:లక్షిత కంప్యూటర్ సైన్స్ 2వ సంవత్సరం రన్నర్:ఎమ్. నిత్య సంతోషిణి యెషిన్ లెర్నింగ్ - 20 సంవత్సరం ప్రాజెక్ట్ ఎక్స్పో విన్నర్స్: ఆర్, హరిప్రియ, హబీబా, లిఖిత కంప్యూటర్ సైన్స్ 2వ సంవత్సరం రన్నర్: కె. లక్ష్మీ ప్రసన్న -- డిప్లొమా ఎస్.వి. యస్








కాలేజ్ పోస్టర్ ప్రెజెంటేషన్ విన్నర్: మీ నందిని (డేటా సైన్స్ 2వ సంవత్సరం) రన్నర్: వి. రుత్విక - ప్రియచందన్ (మెషీన్ లాజికల్ పజిల్స్ విన్నర్: కె. రమ్య (మెషిన్ లెర్నింగ్ 3వ సంవత్సరం) రన్నర్: ఎన్. స్నిగ్ధాసాయి (వేటా సైన్స్ 3వ సంవత్సరం) టెక్నికల్ క్విజ్ నేహా -- కంప్యూటర్ సైన్స్ 4వ సంవత్సరం,నిహారిక కంప్యూటర్ సైన్స్ 4వ సంవత్సరం,అశ్విని -- కంప్యూటర్ సైన్స్ 1వ సంవత్సరం,వరలక్ష్మి- కంప్యూటర్ సైన్స్ 1వ సంవత్సరం రన్నర్స్:దుర్గ భవాని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 2వ సంవత్సరం,సైలేఖ -- డేటా సైన్స్ 3వ సంవత్సరం,మౌనిక - మెషిన్ లెర్నింగ్ 3వ సంవత్సరం,పల్లవి -- మెషీన్ లెర్నింగ్ 3వ సంవత్సరం న్లిమిటెడ్ ఫ్యాషన్ షోట్రెడేషనల్ అప్పియరెన్స్ విభాగం1.ఇందు (ఈ. సి. ఈ 4వ సంవత్సరం) 2. అంజలి (డేటా సైన్స్ 3వ సంవత్సరం) మోడలింగ్ విభాగం1. సుధూర్తి (ఈ, సీ. ఈ 2వ సంవత్సరం) 2. ఎన్. లహరి (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, 4వ సంవత్సరం)

# అట్టహాసంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు.....

**జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన మేయర్ ఎమ్మెల్యే కలెక్టర్...**

**ప్రత్యేక ఆకర్షణగా స్వచ్ఛ బ్రాండ్ అంబాసిడర్ "రచ్చ" రవి ప్రదర్శన...**

**జీడబ్ల్యుఎంసి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు....**

**తొలి అక్షరం/హన్మకొండ ప్రతినిధి:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం జీ డబ్ల్యూ ఎం సి ఆధ్వర్యం లో హన్మకొండ లోని కాళోజీ కళాక్షేత్రం లో నిర్వహించిన వేడుకలు అట్టహాసం గా జరుగాయి.ఈ వేడుకలకు నగర మేయర్ గుండు సుధారాణి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి నీలిమ దంపతులు,హన్మకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్,కుడా చైర్మెన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి లు ముఖ్య అతిధులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమం లో పాల్గొన్న జీ డబ్ల్యూ ఎం సి స్వచ్ఛ బ్రాండ్ అంబాసిడర్ "రచ్చ" రవి పాల్గొని తన మాటలతో మిమిక్రీ తో శానిటేషన్ సంబంధ తడి పొడి చెత్త ను వేరుగా అందించడం డ్రైన్ లలో చెత్త ను వేయకుండా ఉండడం తదితర అంశాలను తన దైన కామెడీ తో ఆహుతులను అలరిస్తూ ఆలోచింపజేసే విధంగా ప్రదర్శన నిర్వహించారు.మహిళా గొప్పదనాన్ని తెలియజేస్తూ "నీ రుణం తీరేది ఎట్లా?" అనే పుస్తకాన్ని రచించి మాతృదినోత్సవం (మే 10)న ఆవిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు.ఈ సందర్భంగా షీ టీమ్ వారు రూపొందించిన షార్ట్ ఫిలిం ను ప్రదర్శించి మహిళల పై వేధింపులకు పాల్పడితే తమకు సమాచారం అందజేయాలని షీ టీమ్ ఇన్స్పెక్టర్ సుజాత తెలిపారు.అనంతరం వివిధ రంగాల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన ఉద్యోగులు సిబ్బందిని అతిథులు శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.ఈ కార్యక్రమ ప్రాంభోత్సవానికి ముందు అతిథులు కళాక్షేత్రం ఆవరణ లో ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు.అంగన్వాడీ టీచర్ లు,మహిళా కార్పొరేటర్ లు వివిధ జానపద గీతాలకు లయబద్ధంగా నృత్యాలు చేసి కార్యక్రమాన్ని మరింత హుషారుగా మార్చారు.ఇనగాల వెంకట్రామ్ రెడ్డి గారు మాట్లాడుతూ "సృష్టిలో మహిళ పాత్ర అనన్యం. ఇంటిని దిద్దుకోవడమే కాకుండా, నేడు పాలనలోనూ, అభివృద్ధిలోనూ పురుషులకు దీటుగా రాణిస్తున్న మహిళా శక్తికి నా అభివందనం," అని ఆయన కొనియాడారు.హన్మకొండ జిల్లా అభివృద్ధిలో మహిళా సంఘాల కృషి మరువలేనిదని, మహిళా సాధికారత కోసం మరిన్ని ప్రత్యేక ప్రాజెక్టులు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు. మహిళల భద్రత, ఆరోగ్యం మరియు ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్న విషయాన్ని ఆయన స్పష్టం చేశారు. ప్రతి మహిళా ఒక విజేతగా ఎదగాలని, అడ్డంకులను అధిగమించి ఆకాశమే హద్దుగా రాణించాలని పిలుపునిచ్చారు.మహాలక్ష్మి పథకం ఉచిత బస్సు ప్రయాణం), మహిళా సంఘాలను (ఎస్ హెచ్ జి) పారిశ్రామికవేత్తలుగా మార్చడం కోసం మహిళలకు సోలార్ ప్లాంట్ల నిర్వహణ, విజయా డైరీ పార్లర్ల ఏర్పాటు వంటి అవకాశాలు కల్పిస్తున్నాము, డ్వాక్రా సంఘాల సభ్యుల కోసం ప్రభుత్వం కొత్త బీమా పాలసీని తీసుకురానున్నామని, బ్యాంకు రుణం తీసుకున్న మహిళా సభ్యురాలు మరణిస్తే, ఆ రుణ భారం కుటుంబంపై పడకుండా ఇన్సూరెన్స్ రక్షణ కల్పిస్తామని అన్నారు. మహిళలు సొంతంగా డైరీ వ్యాపారం ప్రారంభించడానికి ఆర్థిక సహాయం దీని ద్వారా నెలకు ₹20,000 నుండి ₹40,000 వరకు సంపాదించే అవకాశం ఉంటుంది. అర్హులైన ఒంటరి మహిళలకు ప్రభుత్వం నెలకు ₹1,000 నుండి ₹2,016 వరకు ఆర్థిక సహాయాన్ని పెన్షన్ రూపంలో అందిస్తుంది. పేద మైనారిటీ మహిళలకు, వితంతువులకు మరియు విడాకులు తీసుకున్న మహిళలకు కుట్టు








మిషన్ల పంపిణీ మరియు ఆర్థిక సహాయం అందిస్తామని, మైనారిటీ మహిళా యోజన పథకం కింద ఒంటరి మహిళలు మరియు వితంతువులకు ₹50,000 వరకు ఆర్థిక సహాయం అందించబడు తుందని అన్నారు. భవన నిర్మాణ కార్మికుల కుటుంబాలలోని మహిళలకు ప్రసూతి సమయంలో ఆర్థిక సహాయం అందించబడు తుందని తెలిపారు. నిరాశ్రయులైన పేద కుటుంబాలకు, ముఖ్యంగా మహిళల పేరు మీద ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు. వివిధ రంగాల్లో విశేష ప్రతిభ కనబరిచిన మహిళా ఉద్యోగులను, సామాజిక కార్యకర్తలకు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి స్వయంగా సత్కరించి, వారికి జ్ఞాపికలను అందజేశారు. అనంతరం స్థానిక కళాకారులు మరియు విద్యార్థులచే మహిళా శక్తిని చాటిచెప్పే నృత్య, సంగీత ప్రదర్శనలను తిలకించారు.ఈ కార్యక్రమం లో పలువురు మహిళా కార్పొరేటర్ లు,మహిళా అధికారుణులు మెప్మా కు చెందిన ఎస్ హెచ్ జీ బృందాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.









# ప్రజల ఆరోగ్య పరిరక్షణే ప్రభుత్వ బాధ్యత: ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**• కేశంపేటలో ఘనంగా 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక' మెగా వైద్య శిబిరం • హైదరాబాద్ నిపుణులతో 60 రకాల వ్యాధులకు ఉచిత పరీక్షలు • విద్య, వైద్య రంగాల బలోపేతమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం**

**తొలి అక్షరం/షాద్ నగర్, మార్చి09:** ప్రజల ఆరోగ్యం, వారి పరిరక్షణే ధ్యేయంగా మా ప్రభుత్వం పనిచేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం కేశంపేట మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షులు వీరేష్ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా కేశంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన మెగా ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ఆసుపత్రిలోని అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రి ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేయాల్సిన ఆసుపత్రి భవనం అర్ధంతరంగా ఆగిపోవాడాన్ని ఆయన గమనించి అందుకు గల కారణాలను వైద్యులను, స్థానిక నేతలను అడిగి తెలుసుకొని, మిగిలిన పనులను వెంటనే పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... కీలక వ్యాఖ్యలు చేశారు. **ప్రజల వద్దకే పాలన.. ఇంటింటికీ సంక్షేమం** ఈ నెల 6 నుండి 15వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా 'ప్రజా పాలన ప్రణాళిక' కార్యాచరణ జరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఇందులో భాగంగానే కేశంపేటలో ఈ మెగా హెల్త్ క్యాంప్ ఏర్పాటు చేశామన్నారు. ప్రజల చిన్న చిన్న అవసరాలను సైతం తీర్చడమే ప్రభుత్వ లక్ష్యమని, వారి ఇబ్బందులను లోతుగా తెలుసుకుని సంక్షేమ పథకాలను నేరుగా లబ్ధిదారులకు అందజేస్తామని హామీ ఇచ్చారు. పాలనను ప్రజల వద్దకే తీసుకువచ్చి, ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతామని స్పష్టం చేశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన స్పెషలిస్ట్ డాక్టర్ల బృందం ఈ శిబిరంలో సుమారు 60 రకాల వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తుందని, దాదాపు 500 మంది రోగులు ఈ శిబిరానికి తరలివచ్చారన్నారు. ఆర్ఎంపీల వైద్యం కంటే, ప్రభుత్వ వైద్యులు అందించే శాస్త్రీయ వైద్యమే మేలైనదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పరీక్షలు చేయించుకున్న వారికి ఉచితంగా నాణ్యమైన మందులను పంపిణీ చేస్తున్నామని, ఇంకా ఏమైనా వైద్య సేవలు అవసరమైన రోగులను హైదరాబాద్ లోని పెద్ద ఆసుపత్రులకు పంపి మరింత వైద్య సేవలు అందేలా



చూస్తున్నామని అన్నారు. రోగులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా మెరుగైన సేవలు అందించాలని అధికారులను, డాక్టర్లను ఆయన ఆదేశించారు. **గత ప్రభుత్వ నిర్లక్ష్యం వీడింది** గత ప్రభుత్వ హయాంలో విద్య, వైద్య రంగాలు తీవ్ర నిర్లక్ష్యానికి గురయ్యాయని ఎమ్మెల్యే విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఒక్కొక్కటిగా వ్యవస్థలను చక్కదిద్దుకుంటూ వస్తోందని, ప్రజలకు మెరుగైన పాలన అందించడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని వివరించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు, ప్రజలు కేశంపేటలోని ప్రధాన సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటిని సావధానంగా విన్న ఆయన, సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కేశంపేట మండలం మాజీ జెడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, డిప్యూటీ డి ఎం హెచ్ ఓ విజయలక్ష్మి, కేశంపేట సర్పంచ్ సంతోష శ్రీశైలం యాదవ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు జగదీశ్వర్, మహిళా అధ్యక్షురాలు రాణి, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్యులు, ప్రభుత్వ అధికారులు, మండల ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



# రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం: పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి







**- రైతు వేదికలో వ్యవసాయ యంత్ర పరికరాల పంపిణీ**

**- ఉచిత కుటుంబ సలహా కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) మార్చి 9:** రైతులకు వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చడమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందని పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం పాలకుర్తి మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని, ప్రభుత్వం సబ్సిడీపై మంజూరు చేసిన ఆధునిక వ్యవసాయ యంత్ర పరికరాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నేటి ఆధునిక కాలంలో వ్యవసాయ పనుల్లో యంత్రాల పాత్ర కీలకం. ఖర్చులను తగ్గించి, తక్కువ సమయంలో ఎక్కువ పని పూర్తి చేసుకునేందుకు ఈ పరికరాలు ఎంతో దోహదపడతాయి. రైతుల ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోంది. రైతులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆదర్శవంతమైన దిగుబడులు సాధించాలి అని పిలుపునిచ్చారు. అనంతరం, పాలకుర్తి మండల మహిళా సమైక్య భవనంలో ఏర్పాటు చేసిన ఉచిత కుటుంబ సలహా కేంద్రాన్ని ఎమ్మెల్యే లాంఛనంగా ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ, ప్రస్తుత సమాజంలో కుటుంబ విలువల ప్రాముఖ్యతను వివరించారు. చిన్నపాటి మనస్పర్థలతో కుటుంబాలు విచ్ఛిన్నం కాకుండా, చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ సలహా కేంద్రం వేదికగా నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మహిళా సంఘాలు చొరవ తీసుకుని, బాధితులకు అండగా నిలవాలని కోరారు. ప్రజాప్రతినిధులు, వ్యవసాయ శాఖ ఏడీఏ, ఏవోలు, మహిళా సంఘాల సభ్యులు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) మార్చి 9:** పేద కుటుంబాల్లో ఆడపిల్లల వివాహాలు భారం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాలను అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందని పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె పాలకుర్తి మండలానికి చెందిన 14 మంది లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక సాయం పేద కుటుంబాలకు ఎంతో అండగా నిలుస్తుందని, ఆడబిడ్డల పెళ్లిళ్లు గౌరవప్రదంగా జరగాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ఆమె సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి: మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్







**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) మార్చి 9:** మహిళలు అన్ని రంగాల్లో రాణించటం కృషి చేయాలని తొర్రూర్ మున్సిపల్ వైస్ చైర్మన్ సోమ రజిని రాజశేఖర్ అన్నారు. ఐఎల్ఎస్ఐ రాధిక రాకేష్ ట్యూషన్‌లో ఆదివారం రాత్రి అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్యూషన్ నిర్వాహకురాలు రాధిక రాకేష్ ఎనమాల తో కలిసి విద్యార్థుల మాతృమూర్తులను ఘనంగా సన్మానించారు. అనంతరం రజిని రాజశేఖర్ మాట్లాడుతూ పాఠశాల ముగిసిన అనంతరం ట్యూషన్ సెంటర్లలో విద్యనభ్యసించి అభివృద్ధి చెందాలని కోరారు. విద్యార్థుల ఉన్నతికి ట్యూషన్ సెంటర్లు ఎంతగానో తోడ్పడుతాయని తెలిపారు. పిల్లలు క్రమశిక్షణతో పాటు ఆటపాటల ద్వారా మంచి గ్రామర్ నైపుణ్యాలు, మంచి విలువలు నేర్చుకుంటూ భవిష్యత్తులో మంచి స్థాయికి ఎదగాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉష చౌదరి, సరోజన ,రంగు, శ్రీదేవి , స్పందన, స్వాతి, కమల, మంగు, హేమ, సంగీత, బబ్రీదేవి, దాడిని విద్యార్థినీలు ఆయుష్మతి టి.ఆద్య వైష్ణవి, సహస్ర, వి.ఆద్య,ఆయుక్తశ్రీ, కవిత శశిరా, తరుణి హరిని, రజాల్, శివాని, జోష్నా తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా మహిళా దినోత్సవం

**తొలి అక్షరం/షాద్ నగర్, మార్చి09:** ప్రతి సంవత్సరం మార్చి 8న జరుపుకునే అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ వేడుకలను షాద్ నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల వుమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. మహిళలకు సమాజంలో సమాన అవకాశాలు కల్పించాలని, వారు అన్నిరంగాల్లో రాణించి, సాధికారత సాధించాలని ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ డా.ఎల్.కమల ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మార్పు అనేది ఇంటి నుంచే ప్రారంభం కావాలని, విశ్వంలో చాలా గ్రహాలు ఉన్నాయని, భూమిపైన మాత్రమే ప్రాణం ఉన్న జీవులు జీవిస్తున్నాయని, అందులో మానవ జీవితం చాలా ఉత్తమమైందని తెలిపారు. పురుషులు, స్త్రీల కంటే ముందు మనం మనుషులమని, ఆడ, మగ కలిసి ప్రయాణిస్తేనే అర్థం, పరమార్థం ఉంటుందన్నారు. స్త్రీ పురుషులిద్దరూ ఒక బండికి జోడెద్దులుగా ప్రయాణించినప్పుడే సమాజంలో ముందుకెళ్లవచ్చన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన అన్నారం గ్రామ సర్పంచ్ లావణ్య మాట్లాడుతూ కుటుంబానికి మూలం మహిళ అని, ప్రతీ విషయంలో ఆమె సమతుల్యత కలిగి ఉంటుందన్నారు. వైస్ ప్రిన్సిపాల్ పలాది శ్రీనివాసులు మాట్లాడుతూ పాత కాలంలో మహిళలపై వివక్ష ఉండేదని, కొన్ని ప్రాంతాల్లో నేటికీ అది కొనసాగుతుందన్నారు. సావిత్రిబాయి పూలే మొదటి మహిళా ఉపాధ్యాయులుగా అవతరించి స్త్రీవిద్యకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రస్తుతం ప్రభుత్వాలు చదువు పరంగా, ఆర్థిక పరంగా మహిళలకు సమానంగా అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు. వారు ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలని, ప్రభుత్వం అందించే ప్రతిఫలాలను అందిపుచ్చుకోవాలన్నారు. ఆర్థిక శాస్త్ర అధ్యాపకులు డా.పి.సత్యనారాయణ మాట్లాడుతూ ఉద్యోగాల్లో 1/3వ వంతు మహిళా రిజర్వేషన్లను అందరు స్త్రీలు ఉపయోగించుకోవాలన్నారు. సాంస్కృతిక శాఖ కన్వీనర్ డా.రవి ప్రసాద్ మాట్లాడుతూ మహిళలను







గౌరవించడం మన సంస్కృతిలో భాగమని, స్త్రీలు గౌరవించబడే చోట దేవతలు సంతోషిస్తారన్న ప్రాచీన వాక్యాన్ని గుర్తు చేశారు. మహిళలు మధ్య కాలంలో వచ్చిన కొన్ని మూఢ నమ్మకాల వల్ల చదువుకు, అధికారానికి దూరమయ్యారని, తిరిగి మహిళలు నేడు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారన్నారు. అనంతరం , రంగోలి, మెహందీ , పోస్టర్ ప్రెజెంటేషన్, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రకటించారు. కార్యక్రమంలో డబ్ల్యూ.ఇ.సి. కన్వీనర్ డా.జయ కాగడ, మెంబర్ డా.సి.శాంతి, అధ్యాపకులు అరుణ, చామంతి, కృష్ణవేణి, శిరీష , నాగలింగం, మురళి, స్వాతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమం చివరలో ముఖ్య అతిథి సర్పంచ్ లావణ్యతో పాటు, మహిళా అధ్యాపకులు, మహిళా సిబ్బందిని డబ్ల్యూ.ఈ.సి. సభ్యులు శాలువాలతో ఘనంగా సత్కరించారు.

# మౌలిక సౌకర్యాల కల్పనే ప్రజా ప్రభుత్వ ధ్యేయం





**- విద్యాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కృషి**

**- అమ్మాపురంలో ఎస్సీ హాస్టల్ ఏర్పాటు చేస్తాం**

**- పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి**

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) మార్చి 9:** విద్య అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అంకితభావంతో కృషి చేస్తుందని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి అన్నారు. మండలంలోని దుబ్బ తండా పంచాయతీ పరిధిలోని భీముడు తండాలో దాత సహాయంతో రూ.20 లక్షలతో సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన, అమ్మాపురంలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేపట్టి ప్రభుత్వ పాఠశాలలో కమ్యూనిటీ డెవలప్మెంట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమని తెలిపారు. గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో గ్రామ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అమ్మపురం గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా మురికి కాలువలు ఏర్పాటు చేయాలని స్థానిక సర్పంచ్ సునీత వీరారెడ్డి ఎమ్మెల్యే యశస్విని రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచ్లు ముద్దం సునీత వీరారెడ్డి, ధరావత్ విజయ లింబ, సీనియర్ నాయకులు డాక్టర్ పోనుగోటి సోమేశ్వర రావు, గంజి విజయపాల్ రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, ఏఎంసి డైరెక్టర్ కందడి అచ్చిరెడ్డి, నాయకులు విక్రమ్ రెడ్డి, మహబూబ్ రెడ్డి, చెవిటి సధాకర్, సురేందర్ రాజు, జగన్, అరవింద్ సురేష్, అశోక్, నవీన్‌లు పాల్గొన్నారు.

# పదవీ విరమణ పొందిన కంచర్ల మధుసూదన్ రెడ్డికి ఘన సన్మానం

**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) మార్చి 9:** నాచారం భవానీనగర్ జనరల్ సెక్రటరీ కంచర్ల మధుసూదన్ రెడ్డి ఇటీవల ప్రభుత్వ ఉద్యోగిగా పదవీ విరమణ పొందిన సందర్భంగా భవానీనగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు రాగిరి మోహన్ రెడ్డి కంచర్ల మధుసూదన్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికగా చిత్రపటాన్ని అందజేశారు. ప్రభుత్వ సేవలో ఆయన ఎన్నో సంవత్సరాలు నిబద్ధతతో పనిచేసి మంచి గుర్తింపు పొందారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, అసోసియేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు



# అవతపురంలో ఘనంగా అవగాహన సదస్సు

**సామాజిక అంశాలపై ప్రజలకు దిశానిర్దేశం: సర్పంచ్ తోటకూరి శ్రీనివాస్**





**తొలి అక్షరం/పెద్ద వంగర మార్చి 9 :** పెద్ద వంగర మండలం అవతపురం గ్రామంలో స్థానిక పోలీస్ శాఖ ఆధ్వర్యంలో వివిధ సామాజిక అంశాలపై భారీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమింగ్, మూఢనమ్మకాలు, రోడ్డు భద్రత, బాల్య వివాహాల నిర్మూలన మరియు మత్తుపదార్థాల (గాంజా, గుడుంబా, సారాయి) వ్యతిరేకతపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పెద్దవంగర ఎస్సై సైబర్ నేరాల పట్ల యువత, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తెలియని వ్యక్తులకు ఓటీపీలు చెప్పవద్దని, ఆన్‌లైన్ మోసాల పట్ల జాగ్రత్త వహించాలని, సమాజంలో మూఢనమ్మకాల వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ, చట్టబద్ధమైన జీవనం గడపాలని, మత్తుపదార్థాల వల్ల యువత భవిష్యత్తు నాశనమవుతుందని, ముఖ్యంగా యువత గంజాయి, గుడుంబా వంటి మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి. రోడ్డుపై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించడం, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అత్యవసరం అని జాగ్రత్తగా నడుచుకోవాలని హెచ్చరించారు. గ్రామ సర్పంచ్ తోటకూరి శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, ఇవి ప్రజల్లో చైతన్యాన్ని పెంపొందిస్తాయని తెలియజేశారు. బాల్య వివాహాలు కేవలం చట్టరీత్యా నేరం మాత్రమే కాదని, అవి పిల్లల భవిష్యత్తును, ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయని గుర్తు చేస్తూ, ప్రతి బిడ్డ కనీస విద్యాభ్యాసం పూర్తి చేయడం ఎంతో అవసరమని చెప్పారు. సమాజంలో మార్పు రావాలంటే ప్రతి ఒక్కరూ విద్యావంతులు కావాలని, అప్పుడే మన గ్రామం అభివృద్ధి పథంలో పయనిస్తుందని కోరారు. అంతేకాకుండా, రోడ్డు భద్రతా నియమాలను పాటించడం అనేది కేవలం ట్రాఫిక్ నిబంధన మాత్రమే కాదని, అది ప్రతి ఒక్కరి కుటుంబ భద్రతకు సంబంధించిన బాధ్యత అని గుర్తుచేస్తూ, వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని, సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు. గ్రామ అభివృద్ధిలో అందరూ భాగస్వాములు కావాలని, మూఢనమ్మకాలు, అనవసరపు ఆచారాలను పిల్లలకు దూరంగా ఉంచాలని, వారిని సరైన మార్గంలో నడిపించాలని కోరారు. చదువుతో పాటు క్రీడలు, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ, ఆదర్శవంతమైన గ్రామంగా తీర్చిదిద్దాలని యువతను కోరారు. గ్రామ ఉపసర్పంచ్ గద్దల పరమేశ్వర్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో యువతే కీలక పాత్ర పోషిస్తారని, యువత చెడు వ్యసనాలకు లోనై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, ముఖ్యంగా డ్రగ్స్ వంటి వాటికి బానిసలై ప్రాణాలను, కుటుంబాలను ప్రమాదంలో పడేసుకోవద్దని, వ్యసనాలకు దూరంగా ఉంటూ, పట్టుదలతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను సాధించాలని తెలియజేశారు. కానిస్టేబుల్ సుధాకర్ పోలీస్ శాఖ ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. నేర నియంత్రణలో ప్రజలు, పోలీసులు కలిసి పనిచేయాల్సిన ఆవశ్యకతను వివరించారు. ఈ అవగాహన సదస్సులో భాగంగా ఏర్పాటు చేసిన మ్యాజిక్ షో మరియు పల్లె సుద్దులు కార్యక్రమాలు ప్రజలను, ముఖ్యంగా చిన్నారులను అమితంగా ఆకట్టుకున్నాయి. వినోదంతో పాటు సామాజిక చైతన్యాన్ని కలిగించే సందేశాలను కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. కార్యక్రమ చివరలో గ్రామ సర్పంచ్ తోటకూరి శ్రీనివాస్, గ్రామ ప్రజలు కలిసి, ప్రజలకు అవగాహన కల్పించడంలో కృషి చేసిన పెద్దవంగర ఎస్సై గారిని మరియు అద్భుతమైన ప్రదర్శనలతో అలరించిన కళాకారుల బృందాన్ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువత మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కడపలో వైకాపాకు భారీ షాక్..!

● టీడీపీలో చేరిన 300 కుటుంబాలు



**తొలి అక్షరం/కడప మార్చి 9:** కడప నగరంలో వైకాపాకు చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరడం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. మాజీ కార్పొరేటర్ ఓర్సు బాలకొండయ్య ఆధ్వర్యంలో సుమారు 300 కుటుంబాలు వైకాపాను వీడి టీడీపీ కండువా కప్పుకున్నారు. కడప నగరంలోని 2వ డివిజన్ చలామారెడ్డిపల్లికి చెందిన వైసీపీ మాజీ కార్పొరేటర్ ఓర్సు బాలకొండయ్య మరియు వారి అనుచరులు టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు రెడ్డప్పగారి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ విప్ మరియు కడప ఎమ్మెల్యే రెడ్డప్పగారి మాధవి సమక్షంలో వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకెళ్తోందని, అదే నమ్మకంతో ప్రజలు టీడీపీ వైపు మొగ్గుచూపుతున్నారని పేర్కొన్నారు. కడప నగర అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారని అన్నారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం కల్పిస్తూ నగర అభివృద్ధిలో అందరినీ భాగస్వాములను చేస్తామని హామీ ఇచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గ్రామంలో అవగాహన సదస్సు నిర్వహించిన ఎస్ఐకి ఘన సన్మానం

**ప్రజలకు సైబర్ క్రైమ్, మహిళా భద్రత పట్ల ఎస్ఐ గారు అవగాహన కల్పించడం వల్ల ఎంతో ప్రయోజనం - గ్రామ పర్టీ అధ్యక్షుడు బొమ్మెర బోయిన రవి**



**తొలి అక్షరం/పెద్దవంగర మార్చి 9:** పెద్ద వంగర మండలం అవుతపురం గ్రామంలో సైబర్ నేరాలు, ఆన్‌లైన్ గేమింగ్, మూఢనమ్మకాలు, రోడ్డు భద్రత, బాల్య వివాహాల నిర్మూలన మరియు మత్తుపదార్థాల (గాంజా, గుడుంబా, సారాయి) వ్యతిరేకతపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు ఎస్ఐ గారు చేపట్టిన అవగాహన సదస్సు అభినందనీయమని స్థానిక నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహన సదస్సును విజయవంతంగా నిర్వహించిన ఎస్ఐ గారిని గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బొమ్మెర బోయిన రవి, ఎస్సీఎల్ అధ్యక్షుడు గద్దల యాకస్వామి మరియు వార్డ్ మెంబర్ బెల్లంకొండ వెంకన్నలు కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలోని ప్రజలకు సైబర్ క్రైమ్, మహిళా భద్రత మరియు ఇతర చట్టాల పట్ల ఎస్ఐ గారు అవగాహన కల్పించడం వల్ల ఎంతో ప్రయోజనం చేకూరిందని అన్నారు. పోలీసు శాఖ ప్రజలకు అండగా ఉంటుందనే భరోసాను ఎస్ఐ గారు కల్పించారని అన్నారు ఈ కార్యక్రమంలో తోటకూర శివకుమార్, గద్దల అశోక్, చాట్ల లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు మరియు స్థానిక యువకులు పాల్గొన్నారు.

# ఆర్డీటీపై ఆంక్షలు దుర్మార్గం: డిసిసి అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి ఫైర్



**తొలి అక్షరం/ఉరవకొండ మార్చి 9:** అనంతపురం జిల్లాలో దశాబ్దాలుగా పేదలకు అండగా నిలుస్తున్న ఆర్డీటీ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అనంతపురం జిల్లా కాంగ్రెస్ కమిటీ (డిసిసి) అధ్యక్షుడు వై. మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం ఉరవకొండలో మాజీ ఎమ్మెల్యే వై. విశ్వేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన 'సేవ్ ఆర్డీటీ' ధర్నాలో పాల్గొని కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థ అయిన ఆర్డీటీపై వచ్చిన తప్పుడు ఆరోపణలను సాకుగా చూపుతూ కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం ఎఫ్‌సీఆర్ఏ రిజిస్ట్రేషన్‌ను నిలుపుదల చేయడం అత్యంత దుర్మార్గమని మండిపడ్డారు. ఆర్డీటీ కోసం ప్రజలు, రాజకీయ పార్టీలు ఉద్యమిస్తుండగా, లోకేష్ ఢిల్లీ వెళ్లి కేంద్ర మంత్రులను కలిశామని త్వరలో శుభవార్త వస్తుందని చెబుతున్నారని విమర్శించారు. ఇది ఉద్యమాన్ని నీరుగార్చేందుకు కూటమి ప్రభుత్వం పన్నుతున్న కుట్ర అని ఆరోపించారు. ఫాదర్ విన్సెంట్ ఫెర్రర్ స్థాపించిన ఆర్డీటీ సంస్థ గత 56 సంవత్సరాలుగా జిల్లాలోని బడుగు, బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా నిలిచిందని ఆయన గుర్తుచేశారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ జరిగే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం స్పందించకపోతే రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక బడ్జెట్ కేటాయించి ఆర్డీటీ సేవా కార్యక్రమాలకు ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఇన్చార్జ్ వై. విశ్వేశ్వర్ రెడ్డి, యువనేత వై. ప్రణయ్ రెడ్డి, గడేకల్ కరణం భీమరెడ్డి, హవలిగి భరత్ రెడ్డి, ఏసీ ఎర్రిస్వామి, జడ్పిటిసిలు, ఎంపీపీలు, అలాగే కాంగ్రెస్, సిపిఐ, సిపిఎం నేతలు మరియు ప్రజా సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఆక్రమిత ప్రభుత్వ భూములు పేదలకు పంచుతాం



**- హెల్త్ సెంటర్, వీవో భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి భూమిపూజ.**



**తొలి అక్షరం/తిమ్మాపూర్,మార్చి9:** ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకొని పేదలకు పంచుతామని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు. సోమవారం తిమ్మాపూర్ లో నిర్మించనున్న ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్రం,మహిళా సంఘ భవన నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా స్థానికులు కొందరు తిమ్మాపూర్ లో పలు చోట్ల ప్రభుత్వ భూములు ఆక్రమణలకు గురైనట్టుగా ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టికి తీసుకు వచ్చినప్పుడు ఆయన పైవిధంగా స్పందించారు. ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురవుతుంటే చూస్తూ ఉర్కోబోమని ఆయన స్పష్టం చేశారు. తిమ్మాపూర్ లో సర్వేలు జరిపించి ఆక్రమణలకు గురైన భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటామన్నారు. ఈ దిశగా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. భూమి లేని నిరుపేదలకు ఆ స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే చెప్పారు. నిర్మాణం పనులు చేపట్టనున్న ఆరోగ్య ఉప కేంద్రం స్థలం వద్ద నీరు నిలవకుండా కాలువ ద్వారా మళ్లించాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులకు సూచించారు. వీవో భవన నిర్మాణాన్ని మే మాసాంతానికల్లా పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. అంతేకాకుండా నీటి సౌకర్యం కోసం వీవో భవనం వద్ద బోరు వెల్ వేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తున్నదని ఎమ్మెల్యే చెప్పారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తున్నదన్నారు. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకాల వల్ల ఇప్పటికే ఎంతో మంది మహిళలు పారిశ్రామివేత్తలుగా ఎదిగారని ఆయన చెప్పారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో మహిళా సంఘాలను ఏమాత్రం పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటి వరకు మూడు పర్యాయాలు మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చిన విషయాన్ని ఎమ్మెల్యే గుర్తు చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరిట బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలను మోసం చేసిందని డాక్టర్ కవ్వంపల్లి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని, ఇప్పటి వరకు తిమ్మాపూర్ గ్రామానికి 47 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, మలి,తుది విడుతల్లో మరిన్ని ఇళ్లు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమాల్లో తిమ్మాపూర్ తహశీల్దార్ కర్ర శ్రీనివాస్ రెడ్డి, మండల అభివృద్ధి అధికారి మల్హోత్ర, ఎంపీవో ప్రదీప్, తిమ్మాపూర్ గ్రామ సర్పంచ్ గంకిడి లక్ష్మారెడ్డి, ఉప సర్పంచ్ పైడిపల్లి అంజిబాబు, మండల వైద్యాధికారి డాక్టర్ ప్రసిల్లా, డాక్టర్ పుల్లారావు, పశువైద్యాధికారి డాక్టర్ టి.మౌనిక, పంచాయతీరాజ్ ఏఈ స్నేహజ్యోతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధగోని లక్ష్మినారాయణ గౌడ్, మండల



కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు శ్రీగిరి రంగారావు, పార్టీ నాయకులు పోలు రాము,రమేశ్, చింతిరెడ్డి లక్ష్మారెడ్డి, ముప్పిడి సంపత్ రెడ్డి, నగునూరి శ్రీనివాస్, గ్రామ కార్యదర్శి చింతకింది చంద్రశేఖర్, వార్డు సభ్యులు చిలుకూరి రాజు, నగునూరి రజిత, బొర్ర వంశీ, పోతరాజుల స్వప్న, దేవేందర్, తమ్మనవేణి నర్సయ్య, మాతంగి అంజయ్య,జక్కని నవ్య,సతీష్.మల్లమ్మ,వీవోఏలు నగునూరి మంజుల, ఓరుగంటి శారదరెడ్డి, ఎండీ బిస్మిల్లా పాల్గొన్నారు.

# సోమలరాజు రాజశేఖర్ రాజు విందులో పాల్గొన్న సుగవాసి ప్రసాద్ బాబు

**తొలి అక్షరం/సుండుపల్లి మార్చి 9:** టి.సుండుపల్లి మండలం పొలిమేరపల్లె గ్రామం గుంతరాచల్లెలో సోమలరాజు రాజశేఖర్ రాజు సోమవారం ఆత్మీయ విందు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజంపేట పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు, రాయచోటి నియోజకవర్గ టిడిపి నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రాజశేఖర్ రాజు ఆహ్వానం మేరకు కార్యక్రమానికి విచ్చేసిన సుగవాసి ప్రసాద్ బాబుకు గ్రామ పెద్దలు,అభిమానులు ఘన స్వాగతం పలికారు.గ్రామ ప్రజలతో కొద్దిసేపు ఆత్మీయంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. తరువాత ఏర్పాటు చేసిన ఆత్మీయ విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుండుపల్లి మండల టిడిపి అధ్యక్షులు చప్పిడి రమేష్ నాయుడు, యూనియన్ బాషా, మన్నేరు రామాంజనేయులు, మిక్కిలినేని వెంకటరమణ నాయుడు, బిల్లు నాయక్, రెడ్డి నాయక్, హరిప్రసాద్ రాజు, బడిశెట్టి రవి, ప్రవీణ్ రాజు, మనోహర్, వాసు, విశ్వనాథ్, వెంకటరమణ, రాహుల్, రెడ్డి తదితర స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు,పాల్గొన్నారు.

# అమెరికాలో 'ఉస్తాద్' ఫీవర్..

## విడుదలకు ముందే రికార్డు వసూళ్లు!



పవర్ స్టార్ పవన్ కల్యాణ్, మాస్ డైరెక్టర్ హరీశ్ శంకర్ కాంబినేషన్‌లో వస్తున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రంపై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ అంచనాలకు తగ్గట్టే సినిమా విడుదలకు ముందే ఓవర్సీస్ మార్కెట్‌లో తన సత్తా చాటుతోంది. ముఖ్యంగా నార్త్ అమెరికాలో ఈ సినిమాకు అద్భుతమైన స్పందన లభిస్తోంది. అక్కడ ప్రీమియర్ షోల బుకింగ్స్ ప్రారంభమైన కొన్ని గంటల్లోనే 50 వేల డాలర్లకు (భారత కరెన్సీలో సుమారు రూ. 41 లక్షలు) పైగా గ్రాస్ వసూలు చేసి ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరిచింది. ఇది కేవలం ఆరంభం మాత్రమేనని, రాబోయే రోజుల్లో బుకింగ్స్ మరింత పుంజుకుంటాయని ట్రేడ్ నిపుణులు అంచనా వేస్తున్నారు. పవన్ కల్యాణ్‌కు విదేశాల్లో ఉన్న బలమైన ఫ్యాన్ బేస్, అలాగే హరీశ్ శంకర్‌తో ఆయన కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'గబ్బర్ సింగ్' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా ఉండటంతో ఈ క్రేజ్ ఏర్పడింది. సినిమాకు పాజిటివ్ టాక్ వస్తే, నార్త్ అమెరికా మార్కెట్‌లో కొత్త రికార్డులు సృష్టించడం ఖాయమని భావిస్తున్నారు. ఈ జోరు చూస్తుంటే ప్రీమియర్లతోనే భారీ వసూళ్లు రాబట్టే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది. మైత్రీ మూవీ మేకర్స్ అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తోంది. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమాలో పవన్ సరసన శ్రీలీల, రాశీ ఖన్నా హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఇద్దరు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్లు దేవి శ్రీ ప్రసాద్, థమన్ సంగీతం అందిస్తుండటం విశేషం. వీరిద్దరి సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం ధీమా వ్యక్తం చేస్తోంది. పవన్ ఇమేజ్‌కు తగ్గట్టుగా హరీశ్ శంకర్ ఈ సినిమాను పవర్-ప్యాక్డ్ యాక్షన్ సీక్వెన్స్‌లతో తీర్చిదిద్దుతున్నారు. 'ఓజీ' వంటి భారీ చిత్రం తర్వాత పవన్ కల్యాణ్ నుంచి వస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో ఉత్సాహం రెట్టింపు అయింది. 'ఉస్తాద్ భగత్ సింగ్' ఈ నెల 19న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. విడుదలకు పది రోజుల ముందే ఓవర్సీస్‌లో ఈ స్థాయిలో బిజినెస్ జరగడం చూసి, సినిమా బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ప్రభంజనాలు సృష్టిస్తుందోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

# ఆ నిర్మాత వల్ల నెల రోజులు ఖాళీగా ఉన్నా...



బాలీవుడ్ నటి ఆదా శర్మ సినీ ఇండస్ట్రీలో తనకు ఎదురైన ఓ చేదు అనుభవాన్ని అభిమానులతో పంచుకున్నారు. డేట్స్ సర్దుబాటు చేసే క్రమంలో ఓ నిర్మాత తన మేనేజర్‌ను బూతులు తిట్టారని, ఆ నిర్మాత తీరు వల్ల తాను నెల రోజుల పాటు ఎలాంటి పని లేకుండా ఇంటికే పరిమితమవ్వాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆమె తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోను పోస్ట్ చేశారు.
తాను ఒకే సమయంలో మూడు సినిమాలకు అంగీకరించానని, అయితే మొదటి సినిమా డేట్స్ పదే పదే మారడంతో మిగతా రెండు ప్రాజెక్టుల షెడ్యూల్స్‌కు ఇబ్బంది వచ్చిందని ఆదా తెలిపారు. అయినా సరే మొదటి సినిమా నిర్మాత తనకు ఆ పలానా తేదీలే కావాలని పట్టుబట్టారని, ఈ క్రమంలో తన మేనేజర్‌ను అసభ్య పదజాలంతో దూషించారని ఆమె వెల్లడించారు. ఈ విషయం తెలుసుకున్న మిగతా ఇద్దరు దర్శకులు చాలా హుందాగా వ్యవహరించి తమ షూటింగ్ తేదీలను మార్చుకున్నారని ఆదా వివరించారు. మూడో సినిమా నిర్మాత అయితే తనకోసం ఏకంగా ఇతర నటీనటుల డేట్స్ కూడా అడ్జస్ట్ చేశారన్నారు. "ఇండస్ట్రీలో చెడ్డవాళ్లే కాదు, మంచివాళ్లు కూడా ఉన్నారని చెప్పడానికే ఈ విషయం చెబుతున్నా" అని ఆమె అన్నారు. అయితే, అందరూ సర్దుబాటు చేసుకున్నాక, మొదటి సినిమా నిర్మాత మాత్రం తనకు ఇప్పుడు ఆ డేట్స్ వద్దని చెప్పడంతో తాను మానసికంగా, ఆర్థికంగా దెబ్బతిన్నానని ఆదా వాపోయారు. ఇదే సమయంలో 'ది కేరళ స్టోరీ' సీక్వెల్‌లో తాను ఎందుకు నటించడం లేదన్న దానిపై కూడా ఆదా శర్మ స్పందించారు. తాను భాగం కాని సినిమా గురించి వార్తల్లో నిలవడం కోసం మాట్లాడటం సరికాదన్నారు. తనకు సీక్వెల్‌లో అవకాశం వచ్చిందా లేదా అనేది మేకర్స్, తన మధ్య ఉండాల్సిన విషయమని స్పష్టం చేశారు. మొదటి భాగం ఆఫ్ఘనిస్తాన్‌లోని ఐసిస్ క్యాంపుల నేపథ్యంలో సాగితే, రెండో భాగం పూర్తిగా భిన్నమైన కథ అని ఆమె తెలిపారు.

# మైక్ దొరికితే తెలివి పెరగదు..

## పార్థిబన్‌కు త్రిష స్ట్రాంగ్ కౌంటర్!



ప్రముఖ నటుడు ఆర్. పార్థిబన్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై స్టార్ హీరోయిన్ త్రిష కృష్ణన్ ఘాటుగా స్పందించారు. మైక్రోఫోన్ చేతికి దొరికినంత మాత్రాన మాట్లాడే మాటల్లో తెలివి ఉండదని, అది మూర్ఖత్వాన్ని మరింత గట్టిగా వినిపిస్తుందని ఆమె చురకలంటించారు. ఇటీవల ఒక అవార్డుల కార్యక్రమంలో త్రిషను ఉద్దేశించి పార్థిబన్ చేసిన వ్యాఖ్యలు కోలీవుడ్‌లో దుమారం రేపాయి.



### అసలేం జరిగింది?

ఇటీవల జరిగిన గలాటా అవార్డ్స్ కార్యక్రమంలో గతంలో తను కలిసి పనిచేసిన నటీనటులపై అభిప్రాయం చెప్పాలని పార్థిబన్‌ను కోరారు. ఈ క్రమంలో తెరపై త్రిష ఫొటో కనిపించగానే, ఆయన ఆమె పేరును నేరుగా ప్రస్తావించకుండా పరోక్ష వ్యాఖ్యలు చేశారు. "ఈ కుందవైని కొన్ని రోజులు ఇంట్లోనే ఉంచాలి. బయటకు రాకుండా చూసుకోవాలి. అదే మంచిది" అని అన్నారు. ఇటీవల నటుడు, రాజకీయ నాయకుడు విజయ్‌తో కలిసి త్రిష ఒక వివాహ వేడుకలో కనిపించిన నేపథ్యంలో పార్థిబన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

### ఘాటుగా స్పందించిన త్రిష

ఈ వివాదంపై త్రిష తన ఎక్స్ (ట్విట్టర్) ఖాతా ద్వారా గట్టిగా బదులిచ్చారు. "ఇటీవల జరిగిన ఒక ఈవెంట్‌లో ఒక వ్యక్తి తన అసిస్టెంట్ ద్వారా చెప్పించి చివరి నిమిషంలో నా పేరు, ఫొటో చేర్చారని ఆర్గనైజర్లు నాకు తెలిపారు" అని ఆమె వెల్లడించారు. "చేతిలో మైక్ ఉన్నంత మాత్రాన మాట్లాడే మాటలు తెలివైనవిగా లేదా హాస్యంగా ఉండవు. అది మూర్ఖత్వాన్ని మరింత గట్టిగా వినిపిస్తుంది. అవగాహన లేకుండా మాట్లాడే అసభ్యకరమైన మాటలు ఎవరిని ఉద్దేశించి అన్నారో వారి కంటే, మాట్లాడిన వ్యక్తి గురించే ఎక్కువ చెబుతాయి" అని ఆమె పోస్ట్ చేశారు. త్రిష స్పందనకు నెటిజన్ల నుంచి మద్దతు లభించింది.

### క్షమాపణ చెప్పిన పార్థిబన్

తన వ్యాఖ్యలపై వివాదం ముదరడంతో నటుడు పార్థిబన్ దిగివచ్చారు. ఈ నెల 8న తన ఎక్స్ ఖాతా ద్వారా క్షమాపణలు తెలిపారు. త్రిషను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలకు చింతిస్తున్నానని పేర్కొన్నారు. దీంతో ఈ వివాదం ప్రస్తుతానికి సద్దుమణిగింది. అయితే, సహనటిపై సీనియర్ నటుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం పట్ల పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



# ఫన్ ర్యాప్ సాంగ్

డిఫరెంట్ ఎంటర్‌టైనర్స్ చేస్తున్న తరుణ్ భాస్కర్, రైటర్- డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్‌తో కలిసి 'గాయపడ్డ సింహం'తో అలరించబోతున్నారు. ఈ చిత్రాన్ని సప్తస్వ మీడియా వర్క్, పిఓవి స్టోరీస్, జీ స్టూడియోస్ నిర్మిస్తున్నాయి. పవన్ సాదినేని ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు. ఇటీవల విడుదలైన ఫన్ ఫిల్ ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. తాజాగా సినిమాకు సంబంధించిన ఫన్ ప్రమోషనల్ ర్యాప్ సాంగ్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ పాట సినిమా సటైరికల్ టోన్‌ను అద్భుతంగా చూపిస్తోంది. ఈ చిత్రంలో మానస చౌదరి, ఫరియా అబ్దుల్లా కథానాయికలు కాగా, హర్షవర్ధన్, శుభలేఖ సుధాకర్ కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రం2026 వేసవిలో థియేటర్లలో విడుదల కానుంది. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో తరుణ్ భాస్కర్ మాట్లాడుతూ.. 'కశ్యప్ శ్రీనివాస్ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నాడు. అసలైన హీరో ఈ సినిమాకి ఆయన, ఆయన కథ. కష్టపడ్డ సింహం ఆయన. అదృష్టమైన సింహాన్ని నేను. తప్పకుండా ఈ సినిమాని ఫ్రెండ్స్‌తో ఫ్యామిలీతో కలిసి చూడండి' అని అన్నారు. ప్రొడ్యూసర్ భాను కిరణ్ మాట్లాడుతూ.. 'ఈ సినిమాని మా డైరెక్టర్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్‌టైనర్‌గా తీశాడు. సినిమా చాలా బాగా వచ్చింది' అని పేర్కొన్నారు. డైరెక్టర్ కశ్యప్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. 'త్వరలోనే ఈ సినిమా రిలీజ్ అవుతుంది. అందరిని ఎంటర్‌టైన్ చేస్తుంది' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్ అసుర పాల్గొన్నారు.

# విజయ్ సినిమాకు మరో షాక్..

## రిలీజ్ మరింత లేటుగా..

రాజకీయాలపై పూర్తిగా దృష్టి పెట్టేందుకు తమిళ స్టార్ హీరో విజయ్ సినిమాలకు గుడ్‌బై చెప్పిన విషయం తెలిసిందే. అయితే చివరిగా ఆయన నటించిన చిత్రం 'జన నాయగన్'. ఈ సినిమా సంక్రాంతి కానుకగా జనవరిలో విడుదల కావాల్సింది. కానీ, అనుకోని అడ్డంకులు ఏర్పడి సినిమా విడుదల ఆగిపోయింది. ప్రస్తుతం ఈ సినిమా విడుదల కేసు కోర్టులో ఉంది. ఈ సినిమాను రివైజింగ్ కమిటీ వీక్షించాలి. కానీ, కమిటీలో ఒక సభ్యుడు అనారోగ్యం కారణంగా సినిమా స్క్రీనింగ్ చివరి నిమిషంలో వాయిదా పడింది. దీంతో సినిమా రిలీజ్ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. అన్ని సమస్యలు తీరితే సినిమాను ఫిబ్రవరిలో రిలీజ్ చేద్దామని భావించారు. కానీ, అది జరగలేదు. ఆ తర్వాత ఏప్రిల్‌లో సినిమాను విడుదల చేయాలని ప్లాన్ చేశారు. ఇంకా రివ్యూ కమిటీ వీక్షించి రిపోర్ట్ ఇస్తే.. సినిమా విడుదలకు మార్గం సుగమం అవుతుంది. కానీ, అది ఇంకా ఆలస్యం అయ్యేలా ఉంది. దీంతో ఏప్రిల్‌లో కూడా సినిమా రిలీజ్ అయ్యేలా కనిపించడం లేదు. మరోవైపు విజయ్ పుట్టిన రోజు నాడు దీన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఆలోచన ఉన్నట్లు వార్తలు వస్తున్నాయి. జూన్ 22న విజయ్ పుట్టినరోజు కావడంతో జూన్ 18న దీన్ని రిలీజ్ చేయాలని భావిస్తున్నట్లు సమాచారం.

